T.T.D. Religious Publications Series No. 908
Price :

Published by **Sri L.V. Subrahmanyam,** I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

"బ్రహ్మమొక్కటే" గ్రంథమాల

# భక్త నందనార్

ఆచార్య కె.సర్వోత్తమరావు

**తిరుమల తిరుపతి దేవస్థానములు,**
**తిరుపతి.**

"బ్రహ్మమొక్కటే" గ్రంథమాల

# భక్త నందనార్

రచన

ఆచార్య కె.సర్వోత్తమరావు

ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2012**

# BHAKTA NANDANAR

**by**
**Prof.K. Sarvottama Rao**

T.T.D. Religious Publications Series No. 908
© All Rights Reserved

First Edition: 2012

Copies:3000

*Published by :*
**L.V. SUBRAHMANYAM**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P:*
Editor in Chief Office,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517507

# ముందుమాట

భారతదేశంలో అనాదిగా ఆ యా కాలాల్లో, ఆ యా కులాల్లో, ఆ యా ప్రాంతాల్లో అవతరించిన మహనీయులు ఎందరో మనకు దర్శనమిస్తారు. ఆ మహాపురుషులు అందరు వారి వారి కాలాల్లోని వివిధ పరిస్థితుల్లో కేవలం మనుగడ సాగించడం మాత్రమేగాక మానవోద్ధరణకు కృషి చేశారు. తద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యంతోపాటు ఆధ్యాత్మిక వికాసానికి కూడా ఆ మహామనీషులు ఎంతగానో తోడ్పడ్డారు.

అలాంటి మహాత్ముల జీవితగాథలను, వారు ప్రబోధించిన జీవన సత్యాలను, ఆధ్యాత్మిక సందేశాలను భక్తులకు అందించాలన్న తలంపుతో తిరుమల తిరుపతి దేవస్థానం **"బ్రహ్మ మొక్కటే"** అనే శీర్షిక క్రింద ఒక గ్రంథమాలను ప్రారంభించింది. అందు కనుగుణంగా కొందరు పండితుల చేత అలాంటి మహాపురుషుల జీవనరేఖను చిత్రించే గ్రంథాలను రాయించి ప్రచురించాలని సంకల్పించింది.

అందులో భాగంగా ప్రస్తుతం డా॥ ఆచార్య కె.సర్వోత్తమరావుగారు రచించిన **"భక్త నందనార్"** అన్న పుస్తకాన్ని అందజేస్తున్నాము. ఈ గ్రంథ పఠనం ద్వారా, పిల్లలు, పెద్దలు ఆధ్యాత్మికచైతన్యవంతులు కావాలని ఆకాంక్షిస్తూ..

*సదా శ్రీవారి సేవలో....*

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# విషయసూచిక


| | |
|---|---|
| సనాతనధర్మం | 1 |
| సనాతనధర్మంలో అనేకశాఖలు | 2 |
| ఆలయసంస్కృతి | 4 |
| ఆలయాలు – భక్తి ఉద్యమాలు | 5 |
| నాయన్మార్లు | 6 |
| నందనార్ వాసస్థలం | 7 |
| ఆదనూర్ పంటపొలాల పరిసరం | 8 |
| తిరుప్పంగూర్ పయనం | 17 |
| నందీశ్వరుడు పక్కకు తప్పుకోవడం | 22 |
| నందనార్ చిదంబరం చింత | 26 |
| కళ్ళాలలో కైలాసనాథుడు | 30 |
| నందనార్ చిదంబరదర్శనం | 32 |
| నందనార్ శివైక్యం | 35 |

## అనుబంధం


| | |
|---|---|
| **చిదంబర క్షేత్ర స్థలపురాణం** | **37** |
| **చిదంబరం –'వైష్ణవ' దివ్యదేశం** | **39** |
| **మరికొన్ని ఆలయ నిర్మాణవిశేషాలు** | **40** |
| **నటరాజ విగ్రహమూర్తి వైశిష్ట్యం** | **41** |
| **చిదంబరం – నాయన్మార్లు** | **42** |
| **తమిళ, శైవసంప్రదాయంలో నందనార్ వృత్తాంతాలు** | **43** |
| **సంకీర్తనలలో 'చిదంబరం'** | **45** |
| **ఉపయుక్త గ్రంథసూచి** | **48** |


# భక్త నందనార్

### సనాతనధర్మం

ప్రపంచంలో అనేక మతాలున్నాయి. వాటిలో హిందూమతం ప్రాచీనమనడంలో సందేహం లేదు. విదేశీయులు భారతదేశం ఎల్లలకు చేరిన వేళ అఖండ సింధూనదీ ప్రవాహాన్ని చూచి పరవశించి ఆ ప్రవాహనామ మేమిటో తెలుసుకొని 'హిందూ'గా ఉచ్చరించారట. ఆ కారణంగా నది, ఆ నదీతీర ప్రాంతం, పరిసరాలు అన్నీ హైందవంగా రూఢి కెక్కాయి. ఇదే క్రమంగా ఆ సేతు హిమాచల వ్యాప్తమయిన ప్రదేశానికి అన్వయింపబడి హిందూదేశమయింది. ఈ కారణంగా ఇక్కడి వారు హిందువులయ్యారు.

'హిందూ' అనడాన్ని ఆంగ్లంలో HINDU అని వ్రాయడం తెలిసిందే. ఈ అక్షరక్రమాన్ని గుర్తించి ఈ శబ్దానికి ఎన్నో విశిష్టార్థాలు చెప్పిన వారున్నారు. ఈ వివరణ చాల మందికి నచ్చడం కూడా గుర్తించదగ్గ అంశం. H అంటే History చరిత్ర. I అంటే Individuality వ్యక్తిత్వం. N అంటే Nationality జాతీయత. D అంటే Devotion భక్తి లేక Divinity దివ్యత్వం. U అంటే Unity ఏకత లేక ఏకత్వం. హిందూ అనే శబ్దంలో చరిత్ర, వ్యక్తిత్వం, జాతీయత, దివ్యత్వం, ఏకత్వ మనేవి పంచప్రాణాలుగా నిలిచివున్నాయని ఫలితార్థం. భారతీయులకు చరిత్ర ప్రధానం. వ్యక్తిత్వమే నిజమైన జాతీయత. వ్యక్తిత్వం పెంచుకొన్నప్పుడే దివ్యత్వం ఆవిర్భవిస్తుంది. ఆ పవిత్ర దివ్యత్వమే ఏకత్వమనే మోక్షానికి ఆధారంగా నిలుస్తుందని వారి నిశ్చితాభిప్రాయం. అయినా ఇతర మతాలకు నిర్దిష్ట ప్రవక్తలు చెప్పగలిగినట్లు హిందూమతానికి ప్రవక్తను చెప్పడం సాధ్యం కాదు. ఆ కారణం వల్లనే ఈ భూభాగంలోని వారు చరిత్రకందని మతాన్ని, ధర్మాన్ని సనాతనమతమని, సనాతనధర్మమని వ్యవహరించారు.

## సనాతనధర్మంలో అనేకశాఖలు

సనాతనధర్మం ఒక బీజం లాంటిది. ఆ బీజం మొలకెత్తి గట్టిపడి భూమిని చీల్చుకొని ఆపై మొక్కై, మానై శాఖోపశాఖలుగా విస్తరించినట్లు ఈ సనాతన ధర్మంలో అనేక రకాలయిన విశ్వాసాల కారణంగా శాక్తేయం, శైవం, వైష్ణవం లాంటివి విస్తరించాయి. కొమ్మలకు మరల రెమ్మలున్నట్లే ఈ శాక్తేయ, శైవ, వైష్ణవాలలో కూడా అనేక ఉపశాఖలు తమ అస్తిత్వాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నించాయి. అయినా ఇవన్నీ సూక్ష్మభేదాలే గాని అంతిమ లక్ష్యసాధనలో ఏకాభిప్రాయం కలవే.

ఆంతరంగికమైన శాక్తేయ, శైవ, వైష్ణవాలలో ఏది ప్రాచీన మనడంలో అభిప్రాయ భేదాలున్నాయి. ఒక స్త్రీ ఒక శిశువుకు జన్మనివ్వడం, స్త్రీ సాంసారిక జీవితంలో ప్రధాన పాత్ర పోషించడం కారణంగా మగవాడు గుర్తించి ఆరాధన పెంచు కోవడం వల్ల ఆ నేపథ్యంలో స్త్రీ దేవతా ప్రార్థన, ఆరాధన మొదలయిందని, అదే శాక్తేయంగా రూపుదిద్దుకొన్నదని చాలమంది అభిప్రాయం.

ఆది మానవుడు ఆహారసంపాదన ప్రధానంగా భావించి అలమటిస్తూ క్రమంగా 'రాతి పనిముట్లు' వాడే దశలో ప్రకృతి వింతలను పరిశీలించే దశలో 'లింగారాధన' మొదలయిందని మరికొందరి నిర్ణయం. ఇదే క్రమంగా శైవంగా రూపు దిద్దుకొంది.

శైవంలో 'శివుడే' ప్రధానుడు. అతడే పరమేశ్వరుడు. ఆ శివునికి అనేక స్థితులున్నాయి. సృష్టి చేసేవేళ అతడే బ్రహ్మ. లోకసంరక్షణలో అతడే విష్ణువు. తక్కిన స్థితులలో అంటే ప్రళయకాలంలో రుద్రుడు. తిరోధానంలో మహేశ్వరుడు. అనుగ్రహించేవేళ సదాశివుడు. ఆ పరమశివుడు సామాన్య మానవ జీవితానికి సన్నిహితులయిన ఆకారుడు. భక్తవత్సలుడు. కనుకనే ప్రాచీనులు ప్రకృతిలోని కొండల్ని, బండల్ని, శిలల్ని శివుని ప్రతీకలుగా భావించారు. కుప్పబోసిన ధాన్యం లింగాకారం. పాతకాలంలో వాడబడ్డ కొలమానాలలో ధాన్యం నిండుగా పోసి ఆపై ఉవ్వెత్తుగా కొలచి అమ్మడం తెలిసిందే. ఇది కూడా లింగాకారమే. అంతెందుకు? భారతదేశ భౌగోళిక స్థితికూడా లింగాకారమని సమర్థించినవారున్నారు. కాశ్మీరం లింగం పై భాగం. వింధ్యనగప్రదేశం పానవట్టం. దక్షిణ భూభాగం పీఠభాగం. శివుని జటాజూటంలోని గంగలాగా ప్రవాహం పానవట్టం చుట్టి ప్రవహించి తూరుపుసముద్రంలో కలుస్తుందని వారి భావన.



శైవారాధన పెరగడానికి అనేక కారణాలున్నాయి. ప్రావీణ్యంతో కూడిన విగ్రహసృష్టి లింగారాధనలో అవసరం లేదు. అంతే కాదు. శివభక్తగణంలో జంతువులు తరించాయి. దళితవర్గంలోని వారెందరో శివభక్తులు.

వేదంలో భీకర రూపంలో శివుడు రుద్రుడుగా కీర్తింపబడ్డాడు. శతరుద్రీయం ఇందుకు సాక్ష్యం. అయితే అథర్వ వేదంలో ఘోరరూపంతో బాటు ఖర, పశుపతి, ఈశాన, మహాదేవ ఆది సౌమ్యరూపాలు గూడ చెప్పబడ్డాయి. క్రమంగా సౌమ్యమై, జన జీవితానికి అనుగ్రహపాత్రుడు కావడమే కాకుండా లలిత కళలకు ఆరాధ్య దైవం కావడం విశేషం. సాధరణంగా నృత్యగాత్రవినోదాలు ప్రదోషకాలంలో వేళ జరపబడడంవల్ల కూడా పరమశివుని నటరాజమూర్తికి ఆరాధన పెరిగిందనడం సబబు.

**'ఆంగికం భువనం యస్య**
**వాచికం సర్వవాఙ్మయమ్**
**ఆహార్యం చంద్రతారాది**
**తం వందే సాత్వికం శివమ్'**

## ఆలయసంస్కృతి

తమిళంలో 'కోవిల్ ఇల్లా ఊరిల్ కుడి ఇరుక్క వేండామ్' అని ఒక సామెత. ఆలయం లేని ఊరిలో నివాసం చేయవద్దు అని అర్థం. 'కో' అంటే దేవుడు. నివాసాన్ని సూచించేది ఇల్. అందుకే కోవిల్. దీనినే తెలుగులో 'గుడి' అంటే సంస్కృతంలో ఆలయం, మందిరం, దేవస్థానం అని అంటారు.

భారతీయులకు 'ఆలయనిర్మాణం' పవిత్ర పుణ్యకార్యం. వైయక్తిక సామాజిక ప్రయోజనాలు ఆలయనిర్మాణంలో పెనవేసుకొని వున్నాయి.

**"కూపస్తటాకముద్యానం మండపం చ ప్రపా తథా
సద్ధర్మకరణం పుత్రః సంతానం సప్తధోచ్యతే"**

అని పెద్దలన్నారు. వీటితో బాటు తటాకప్రతిష్ఠ, ధననిక్షేపం, అగ్రహారప్రతిష్ఠ, వనప్రతిష్ఠ, ప్రబంధనిర్మాణం, సత్రప్రతిష్ఠలు సప్తసంతానాలుగా గణింపబడ్డాయి. ఈ దృష్టితో 'ఆలయనిర్మాణ' ఆసక్తి – పాలకులలో, ఆస్తికులలో పెరిగింది. దేవుడు అందరివాడు కావడంతో దైవకార్యం సామాజికం కాగా 'దేవుని పెళ్ళికి అందరు పెద్దవాళ్ళు' కావడం రూఢి అయింది.

హైందవులు ఆలయనిర్మాణంలో ఆశించిన వెన్నో ఉన్నాయి. అనాథనిలయంగా, ప్రమాణ వేదికగా, ఆధ్యాత్మిక చర్చా కేంద్రంగా, పవిత్ర వైద్యాలయంగా, యోగ సాధకంగా, సర్వకళాప్రదర్శక రంగస్థలిగా, చదువుల బడిగా, శ్రద్ధాకేంద్రంగా భావించారు. అందుకే 'ఆలయవ్యవస్థను' రాజ్య వ్యవస్థకంటే బలంగా తీర్చిదిద్దారు. ఆలయనిర్మాణానికి రాజులు, చక్రవర్తులు పోటీపడ్డారు. ఈ పోటీలో చోళులు, పాండ్యులు అసమాన భక్తిప్రపత్తులు ప్రకటించారు. అందుకు తగ్గట్టు ఆలయకళ మొగ్గ తొడిగింది. భారతదేశంలో ప్రత్యేకించి దక్షిణాపథంలో ఆకాశాన్ని అంటే గోపురాలు, అతివిస్తర ఆలయ ప్రాంగణాలు. అంగరంగవైభవోత్సవాలు. సనాతన ధర్మమూలసూత్రాలకు భంగం లేని రీతిలో వేదాగమసంప్రదాయాలు విస్తరించాయి.



తమిళనాడులో శక్త్యాలయాలు, వైష్ణవాలయాలు, శివాలయాలున్నా శివాలయాలే ఎక్కువ అనడంలో రెండవ అభిప్రాయం లేదు. దాక్షిణాత్య శైవం సర్వజనాంగీకృతం కావడం విశేషం. పైగా వేదానుసరణం కావడం వల్ల పండితపామరులను ఏకం చేయగలిగింది. దళితులను, అనేకరకాల కులవృత్తుల వారిని, మేధావులతో 'ఏక' తాటిపై నడిపించేలా చేసింది. భక్తి ఉద్యమాలకు కేంద్రం కాగలిగింది.

## ఆలయాలు, భక్తి ఉద్యమాలు.

చతుర్విధ పురుషార్థాలలో 'మోక్షం' చివరిది. ప్రతి జీవి అంతిమలక్ష్యం మోక్షం. మోక్ష సాధన కర్తవ్యమయినప్పుడు ఆ సాధనకు ఎన్నో మార్గాలు సూచింపబడ్డాయి. యాగాలు, యోగమార్గాలు సామాన్యులకు సుసాధ్యం కావు. పైగా కులమతలింగ భేదాలు చాలవాటికి ప్రతిబంధకాలయిన వేళ, కలియుగ మానవులకు భక్తిమార్గమే ఏకైక శరణ్యమయింది.

భజ్ ధాతువునుండి 'భక్తి' శబ్దం వ్యుత్పన్నం. భక్తి అంటే సేవ. ఇది పాణిని మతం. కొందరు భక్తి భంజ్ ధాతునిష్పన్నమని భావిస్తారు. భంజ్ అంటే విడగొట్టు, భగ్నం చేయు అని అర్థాలు. సాధనావస్థలోని సేవ క్రమంగా సిద్ధావస్థలో భగవంతుని చేరుస్తుంది. అందువల్ల భక్తికి 'కూడుకొనుట' అని కూడా అర్థం.

కాళిదాసు రఘువంశంలో భవతి విరల భక్తిః మ్లాన పుష్పోపహారమ్ (రఘువంశం 6.74), ఆబద్ధముక్తాఫల భక్తి చిత్రే (కుమారసంభవం 7–10) ,భక్తి శోభాసనాథమ్ (కుమార 7–94) కూర్చడం, పెట్టడం అనే అర్థాలలో వాడినట్లు స్పష్టం. అందువల్ల భక్తి అంటే విడిపోవడం, సేవ, కలుసుకోవడం, రచనావిశేషం అని అర్థాలు.

భగవత్ సాక్షాత్కారానికి, అనుగ్రహానికి భక్తికి మించిన సాధనం మరొకటి లేదని భాగవతం స్పష్టం చేస్తుంది. భగవంతుని సేవించి తరించడమే భక్తి. కర్మఫలం ఆశించకుండా ఉండడం భక్తి అని సాయణాచార్యులు వివరించారు. శంకర భగవత్పాదులు, 'మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ' అన్నారు. స్వస్వరూప అనుసంధానమే భక్తి. ఆత్మతత్త్వ అనుసంధానమే భక్తి. భక్తి ప్రేమస్వరూపం, తైలధారలాంటిది భక్తి. నారదుడు నవవిధ భక్తి మార్గాలను బోధించినవాడు.

**'శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్'**

ఈ తొమ్మిది మార్గాలలో భక్తుడు పయనించి స్వామి కృపకు పాత్రుడవుతుంటాడు. అటువంటి భక్తులు శైవులు కావచ్చు, వైష్ణవులు కావచ్చు, శాక్తేయులు కావచ్చు లేదా ఇష్టదైవాన్ని ఎన్నుకొన్న వారెవరయినా కావచ్చు.

ఈ 'భక్తి తత్త్వం' వేదపురాణేతిహాసాలలో ఉన్నా దక్షిణ దేశంనుండి ఇతర ప్రాంతాలకు ప్రాకిందని చారిత్రకులు భావిస్తారు. ఈ తత్త్వాన్ని త్రికరణశుద్ధిగా ప్రచారం చేసినవారు నాయన్మార్లు, ఆళ్వార్లు.

## నాయన్మార్లు

తమిళంలో 'నాయన్' అంటే నాయకుడు. అతడు తండ్రి కావచ్చు, పతి కావచ్చు, రాజుకూడా కావచ్చు, పరమశివుడూ నాయకుడే. నడిపించేవాడూ నాయకుడు. నాయన్ శబ్దంనుండి 'నాయన్మార్' వ్యుత్పన్నం. తమిళ నిఘంటువుల్లో ఈ శబ్దానికి రాజు, యజమాని, అయ్యణార్, దేవుడు, శివుడు, గొప్పదనం కలవాడు, నాయకుడు, శివభక్తుడు, సన్యాసి, దైవభావం కలవాడు అనే అర్థాలు కనిపిస్తాయి. శైవ సాహిత్యంలో 63 గురు నాయన్మార్లు. వీరిని



'అరువత్తుమూవర్' అనడం సంప్రదాయం. వీరి విగ్రహాలు శైవాలయాలలో దర్శించవచ్చు. వీరందరు ఏక కాలంలోనివారు కారు. వీరిలో అగ్రవర్ణులు, ఇతరులు, దళితులు ఉన్నారు. దళితజాతిలో జన్మించిన వారు భక్తికారణంగా ఇతరులతో బాటు సమానంగా గౌరవం అందుకోవడమే ప్రత్యేకత. ఆలాంటివారిలో 'నందనార్' ఒకడు.

## నందనార్ "వాసస్థలం"

ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయగోదావరి జిల్లాలను ధాన్యాగారంగా భావించినట్లే తమిళులు తమిళనాడులోని తంజావూరు ప్రాంతాన్ని ధాన్యాగారంగా భావిస్తారు. 'నెల్ కళంజియమ్' అని వ్యవహారం. కేవలం పాడిపంటలకేగాక తమిళసంస్కృతికి కూడా తంజావూరు కేంద్రమే. ఆలాంటి తంజావూరుకు దూరంలో కొతెరూర్ అనే నదీతీరంలో 'ఆదనూర్' అనే గ్రామముంది. ఆ ఆదనూర్‌ను ఆనుకొని ఒక దళితవాడ. తమిళంలో 'పరైయర్' అని దళితుల్ని నిర్దేశిస్తారు.

ప్రాచీన కాలంలో అనేక కారణాల వల్ల కొందరు సంఘ బహిష్కృతులయ్యారు. ప్రధాన నగరవాసం వారికి నిషిద్ధమయింది. చదువు సంధ్యలకు వారు దూరమయ్యారు. దారిద్ర్యం, తామసభావం కారణంగా వారు ఎదగలేకపోయారు. వారి గోడు పట్టించుకొన్నవారు కరువయ్యారు. అంతే కాకుండా కలవారికి దాసులు కావడం ఒక దురదృష్టం. వారికి 'ఊడిగం చేయడం' పరమార్థమనుకోవడం కూడా దురదృష్టం. క్రమంగా వారు అస్పృశ్యులయ్యారు. అధికారుల మాటలు శిరోధార్యంగా భావించడం వారి వంతు అయింది. అలాగే ఆనాటి మత సాంఘిక పరిస్థితులు కూడా దళితుల్ని మరీ దూరం చేశాయి. ఆలయప్రవేశం లేదు. స్వామి సందర్శన భాగ్యం లేదు. కాకపోతే ధనవంతుల పొలాలలో పని చేయడం, పశువుల్ని మేపడం, చచ్చిన

పశువుల్ని పాతిపెట్టడం, ఆలయ వాద్యాలకు అవసరమయిన తంతులు, తోలు సమకూర్చడం లాంటివి మాత్రమే మిగిలాయి.

యజమానులు సుఖంగా శుభ్రమయిన వాతావరణంలో జీవిస్తుంటే దళితవాడలు అశుభ్రకేంద్రాలయ్యాయి. ఆదనూరు ఆనుకొన్న దళితవాడ అపరిశుభ్రతకు మారుపేరు. ఎక్కడబడితే అక్కడ జంతువుల ఎముకలు, చర్మాలు, మాంసం, కుక్కల అరుపులు, అంతే కాదు బురదప్రాంతంలో గుడిసెలు, చేపలకోసం ఆకాశంలో తచ్చాడే గద్దలు, తమ కారణంగా మనుష్యుల మధ్య ఆవేశకార్పణ్యాలు, అట్టహాసాలు, ఆర్భాటాలు, అనాలోచిత జీవితాలు. అటువంటి మాలవాడలోనే నందుడు జన్మించాడు. ఇతని తల్లి తండ్రు లెవరో తెలియదు. అయినా 'నందనార్' ఇతరుల కంటే భిన్నంగా ఉండేవాడు. శివభక్తుడుగా పెరిగాడు.

ఆదనూర్ మాలవాడదగ్గర ఒక చెట్టు. ఆ చెట్టు కింది బండలమీద ఇద్దరు ఊగుతూ తూగుతూ వికారంగా పడివున్నారు. రాత్రి వెనక్కి వెళుతోంది. దూరంలో

**'శివశివ నీ పదచింతన గలిగిన**
**సిద్ధము మోక్షము సిద్ధమయా**
**శివ శివ యనరాదా**
**శివ నీ నామము చేదా'**–పాట చెట్టుకింద నిదరపోతున్న వారి చెవుల్లో పడ్డది. వారే వీరేశు, పుల్లయ్యలు.

'ఒరేయ్ పుల్లయ్యా! ఏమిట్రా నీ గోల? రాత్రంతా కుక్కల అరుపుతో కునుకు పట్టదాయ. కాస్త రెప్ప వాల్చేసరికి దోమల బెడద. ఒళ్ళంతా దద్దుర్లు. ఏ నడిజామో నిదరపడితే పడుకోనివ్వకుండా ఏమిట్రా పిచ్చిపాటలు. బుద్ధుండఖ్ఖర్లే' కేకవేశాడు వీరేశు.



'మావాఁ ఏంటి? నన్ను తిడుతున్నావ్. నేనేమయినా నిన్ను తిట్టానా? కొట్టానా? నీ లాగే నేను పడుకొన్నా. నిదర పట్టలేదు. అటు ఇటు దొరులుతూ సివరికి సేయి తలగడగా పడుకొన్నా! ఇందాక పాట ఇనబడితే నీవే పాడుతున్నావనుకొన్నా. నీవేనా రాగం తీసింది? చెప్పవేం' గద్దించాడు పుల్లయ్య. 'ఏరా! ఏళాకోళంగా వుందా? నేనేమిటి? ఆ పిచ్చిపాటలు పాడడమేమిటి? నేనెప్పుడయినా ఇలాంటి పాట పాడానా? నీ అబ్బ...

మావాఁ తిట్టకు గాని నీ పాట ఇంటా ఏదీ నీకు నచ్చిన పాట పాడు అని బతిమాలాడు పుల్లయ్య

ఆలారా! దారికి

'సింతసెట్టు సిగురు చూడు
చిన్నదాని వయసు చూడు'

అపుడే గాడిద కూసింది.

"మావాఁ! ఆపేయ్–ఆపేయ్" నెత్రోజుల కిందట నీవు ఈ పాటపాడేసరికి వాడదొరకి కోపమొచ్చి నా కూతురుమీద పాట పాడతావట్రా అని నాలుగు వాయించింది మరచిపోయావా మావాఁ?

"అవన్నీ! నాకు సెప్పబోక! అయినా నేను పాడలేదు. నీవూ పాడలేదు. నేను గొంతిప్పలేదు. ఎవడ్రా మనవాడలో ఈ ఏళగానిఏళ పాడే మొగోడు?

మావాఁ! గుర్తుకు వచ్చిందిలే. మన వాడలో నొసట ఇబూదెట్టుకొని మెడలో రుద్దరాచ్చమాలేసుకొని యీదుల్లో తిరుగుతాడే వాడే. వానిదే ఈ గొంతు, పసిగట్టేవా! నేను పసిగట్టేశా.

మన జాతిలో సెడపుట్టినాడ్రోయ్– కోడి కూయగానే లేసుంటాడు. పక్కనే వంకలో తానమాడి యిబూదెట్టుకొని పాడుతుంటాడు. రాని రాని! మన ఎదరకు రాని! మా నిదర సెడగొట్టావేమిట్రా దొంగ నీ...

“మావాఁ తిట్టొద్దు మనకు నచ్చలేదుగాని ఆ గొంతు ఎంత బాగుంది. మావాఁ! మనకేసి నందనార్ వస్తున్నాడోయ్ రాని! రాని.” నాలుగు జాడిస్తా

**“శివ శివ యనరాదా**

**శివ నీ నామము చేదా”** అని నందనార్ పాడుతూ వస్తున్నాడు.

‘రేయ్ ఆపరా! ఆపు మా నిదరసెడగొడ్తావట్రా! పగలంతా రెక్కలు ముక్కలు సేసుకొని పొద్దు వాలేసరికి మందు పోసుకొని తొంగుంటే ఇదేమిట్రా శివ శివ! శవమయి పోతావురా జాగ్రత్త ఎవడ్రా శివుడు’ గద్దించాడు వీరేశు.

‘శివ శివా! ఎంత అపచారం! ఎంత అపచారం’ చెవులు మూసుకొన్నాడు నందనార్.

‘మేమూ శివులమే! సూడు నందనారు. నీ శివునికి బట్టల్లేవు. మాకూ లేవు’ అన్నాడు వీరేశు.

‘ నీ శివునికి ఊళ్ళో సోటు లేదు. ఊరవతల ఉత్తరాన. మాదీ ఉత్తరానే వాసం’ గొంతు కలిపాడు పుల్లయ్య.

‘కూడెట్టుకోవడానికి సిల్వర్ పాత్రకూడా లేదు. మాకూ లేదు’

‘పాముల్తో వాసం నీ శివునికి. పందుల్తో వాసం మాకూ’ అంతే అన్నాడు పుల్లయ్య.

‘నీ శివుడు ఇసం మింగాడు. మేమూ నల్లమందు మింగుతాం తెలిసిందా?’ గట్టిగా జవాబిచ్చాడు వీరేశు.

‘సచ్చినోళ్ళు పాతిపెట్టేచోట నీ శివునికి వాసం. సచ్చిన జంతువులతో సావాసం మాకూ’ దీర్ఘాలు తీశాడు పుల్లయ్య.



‘అంతేనా? తోలు ఒలచడం మా వంతు. ఒలిచిన తోలు కట్టుకోవడం నీ శివుని వంతు. సెప్పరా పుల్లయ్య సెప్పు. మన వాడలోని పతి మనిసి శివుడే. ఏమంటావు నందనారూ’

ఆణ్ణేమి అడుగుతావు గాని మావాఁ సక్కగా సెప్పినావ్. శివుడంటే మనసుపడ్డ ఆడదుంది. మనకు లేదు. అంతే కాకుంటే సెట్టు కింద పడుకొంటామా? నందనార్ ఓపిగ్గా విన్నాడు.

అవును. మీ మాటల్లో సత్తెం వుంది. ఇంకా సెప్పాలంటే పతిజీవి శివుడే. శివుని ఆజ్ఞ లేక చీమయినా కుట్టదు అని సామెత.

ఒరేయ్! పుల్లాయ్ ఇపుడయినా తెలిసిందా నా జాణతనం. మనవాడూ ఊకొట్టాడు. అయినా నందనారూ ఇదేమిటి యేషం? మన యింటా వంటా వుందా? ఊరోళ్లకి సేవ సేయడమే మన దమ్మం. పెద్దోళ్ళ పొలాల్లో నడుమువంచి దించినతల పైకెత్తకుండా పొద్దు వాలేదాక పని సేయాలా! ఆరి పశువుల్ని మేపాలా?

మావాఁ! ఆగు. సచ్చిపోయిన ఎనుముల్ని, మూగజీవాల్ని గుంత తీసి పాతెట్టాలా? అంతేగాని నీ యేసానికి మా పనులకి పొత్తు కుదురదులే. నీ యేసం కూడెడుతుందా? బట్టలిస్తుందా? పోనీ తెల్లారగట్ట సెబుతున్నా. ఈ రోజు నుండి నీవు మా జత సేరిపో! లేకపోతే దిక్కులేని సావు సస్తావ్. నీవు సస్తే మేం నీ శవాన్ని కూడా ముట్టుకోం. ఇపుడే సెప్పేశాం. ఆ తర్వాత సెప్పలేదనుకొనేవ్ సుమా’ మాట ఆపి ఆపి చెప్పాడు పుల్లయ్య.

“శివ! శివ! నన్నిలా బతకనీయండి. ఎవరి చివరి రోజులు ఎలా వుంటాయో? ఆ శివునికే ఎరుక! మీకు ఆ కట్టం కలిగించనులే. దేవుడు ఏలా రాసిపెట్టివుంటే ఆలా జరుగుద్ది” అన్నాడు నందనార్.

'పుల్లాయ్, నేను సెప్పలే! మొరటోడు ఆ నందనార్. ఎంత సెప్పినా సెవిటోని దగ్గర సంఖం వూదినట్టే. సెట్లో ఆకులు సల్లగా కదలుతున్నాయ్, సల్లగాలి ఈస్తుండాది. కాసేపయినా కునుకుతీద్దాం' అన్నాడు వీరేశు.

'ఈ వాడలోళ్ళవారికి ఎపుడు బుద్దొస్తుందే యేమో? 84 లక్షల జన్మలొచ్చాక మానవ జన్మ. ఈ జన్మ ఇలా పాడుచేసుకోవడం నాకు సుతరామూ యిష్టంలేదు. 'ఆ శివుడే వీరిని కాపాడాల! వాడ వాడ సల్లగుండాల శివ! శివ ఓం నమశ్శివాయ' అని నిష్క్రమించాడు.

**ఆదనూర్ పంటపొలాల పరిసరం**

ఆదనూర్ వరిపంటకు ప్రసిద్ధి. బిడ్డను పెంచినట్టే వరిపంటను కాపాడుకోవడం. అందుకే పొలం యజమాని జాగ్రత్తపడతాడు. ఆయా పనులకీ కూలీలలను సమకూర్చుకొంటాడు. ఆ భూములు ఒక అగ్రకులస్థునివి. ఆ అగ్రకులస్థుని పూర్వీకులకు ఎవరో మాన్యంగా ఇచ్చారు. గుళ్లో పూజలు చేయడం వారి వంతు. ఆ గుళ్లు కాలక్రమేణ మాయమయ్యాయి. నీరు పోయినా నాచు వదలదు. గుడి పాడయినా గూబ వదలదు. గుడి పొలాలు పూజారి వదలడు లాగా మారిపోయింది. అయినా అగ్రహారీకుడయిన బ్రాహ్మణుడు మోరయ, అనే వాని సాయంతో నెట్టుకు వస్తున్నాడు.

తెల్లారుతుంది. సూరీడు మెల్లగా తన కిరణాలను ప్రసరింపచేస్తున్నాడు. ఆదనూరులో ఆడవాళ్ళు అప్పుడే పంటపొలాల కేసి నడచివస్తున్నారు. ఒకచోట సిన్నక్క పెద్దక్కలు కబురాడుకొంటున్నారు.

పెద్దక్కా: సూరీడి కిరణాలు బల్లెంలా గుచ్చుకుంటున్నాయి. ఈయాళ యెండ పగబట్టినట్టు కాస్తుందే! వాన వస్తుందేమో? రాకేం సేస్తుంది? వాన వత్తాది. వంకలో వరదలు, కాలవల్లో నిండుగా నీళ్ళు-కయ్యల్లోను అంతే. మన అయ్యోరు భూములు పండుతాయి. అనుమాన మెందుకే సిన్నక్కా?



"ఏమో లేమ్మ పెద్దక్క! వాన అని తలచుకోగానే మనసు సల్లబడిపోతాది. వాన పాట అందుకోగాని... సరదాగా పాడుకుందాం.

ఆలాగే నమ్మా రామక్క, సిన్నక్క, లచుమక్క ఒక పక్క

నేనూ రాములమ్మ, సీతమ్మత్త, పెరక్క మరో పక్కా. తెలిసిందా నేను మొదలెడతా! అందుకో

"వానల్లు కురవాలి వానదేవుడా వరిచేలు పండాల వానదేవుడా
పన్నెండు ధాన్యాలు వానదేవుడా బండపోద పండాల వానదేవుడా
మా కడుపు నిండాలి వానదేవుడా కుంట చెరువు నిండాలి వానదేవుడా
బీదసాద బతకాలి వానదేవుడా పేదసాద బతకాలి వానదేవుడా
కూలినాలి దొరకాలి వానదేవుడా కూడూ కొరత లేకుండాలి వానదేవుడా
పారిపోయిన బావ వానదేవుడా పరుగెత్తి రావాలి వానదేవుడా
ఊరెళ్ళిన బావ వానదేవుడా ఉరికురికి రావాలి వానదేవుడా
తూరుపూన మబ్బుపట్టె వానదేవుడా తుళ్ళి తుళ్ళి కురవాలి వానదేవుడా
పడమటా మబ్బుపట్టె వానదేవుడా పట్టి పట్టి కురమాలి వానదేవుడా
ఉత్తరాన మబ్బుపట్టె వానదేవుడా ఉరికురికి కురవాలి వానదేవుడా
వాగు తల్లి నిండాలి వానదేవుడా వరిచేలు పండాలి వానదేవుడా"

దూరాన అగ్రహారీకుడు మోరయ్యతో రావడం గుర్తించింది సిన్నక్కా, పెద్దక్కా! పాట చాలించు, అయ్యోరొస్తున్నాడు. వెంట మారయ్యతో పాటపాడుతుంటే కేకలేస్తాడు. పొలంలోకి దిగుదాం పదవే అంది.

"సిన్నక్కా! ఎందుకే ఆలా బెదరగొడుతున్నావ్? మనమేమయినా తప్పుడు పని సేస్తున్నామటే. పెపంచమంతా బాగుండాలని వాన దేవుణ్ణి మొక్కుంటున్నాం. అయ్యగారి పొలాలు పండుతాయి. మనకు తిండిగింజలొస్తాయి."

"సాల్లేగాని. అయ్యోరికి ఎంతసేపు తన గొడవలు గాని ఊరోళ్ళ సంగతెందుకు పట్టించు కొంటాడు? పెద్దక్కా? సూడు. ఆడ మొగాళ్ళతో అయ్యోరు గొడవపడుతున్నట్టున్నారు. ఏవో కేకలు. నీకు వినబడ్డం లేదా?

'ఏరా! దున్నపోతా! ఇంకా పన్లోకి దిగలేదా' అరుస్తున్నాడు యజమాని.

'అయ్యోరు! వాళ్ళంతే! దున్నపోతుల సావాసం ఎలా పోతుంది? మనవెంతరచినా ఆళ్లకు దున్నపోతు మీద వానపడ్డట్టే' అంటున్నాడు మోరయ్య.

'నాలుగు తగిలిస్తే సరి' కోపంతో ఊగుతున్నాడు యజమాని

"అయ్యోరూ! కసరుకోవద్దండి. బీదోళ్ళం. మాకు పొలమా ఇల్లా! ఈ వూరొదలి ఎక్కడకీ పోలేం. ఈ మట్టిలో పుట్టిన వాళ్ళం. ఈ మట్టిలోనే కలిసిపోతాం. మీ కాలి దగ్గర పడివుండే వాళ్ళం. సాకిరి సేసి బతికే వాళ్ళం". అని దీనంగా చేతులు కట్టుకొని బతిమాలుతున్నాడు రంగయ్య.

"నీ కున్న బుద్ధి అందరికుంటే బాగుండేది. మీ వాళ్ళకంతా చెప్పు. అవును రంగయ్యా! ఏడీ ఆ నల్లటోడు కనబడలేదే.

అయ్యా! నందనారే కద. ఇద్దరం సీకటేళ బయలుదేరాం. గుడి మేళం దొర కబురెట్టాడు. మద్దెలకు మరో తోలు బిగబట్టి కట్టమని. దేవుని పనికదా అని పూర్తి చేసుకొని బినీన వస్తానన్నాడు.

వస్తాడు! వస్తాడు! రానీ! రానీ! మద్దెలు వాయించినట్టు వాయిస్తే సరి. గుడి మేళం గాడు పెద్దా? మనయ్యోరు పెద్దా! ఆ మాత్రం ఇంగితం లేకపోతే ఎలా? రాని! తెలిసివచ్చేలా చేస్తా. గుడ్లురిమాడు మోరయ్య.

ఈ లోగా నందనార్ వచ్చాడు.

'ఏం నాయనా? ఉచ్చవమనుకొన్నావా? లేదా పెళ్ళనుకొన్నావా? నింపాదిగా వస్తున్నావ్' ఎగతాళిగా కేకలేశాడు మోరయ్య.



'అయ్యా? ఆలస్యమయింది. క్షమించండి. గుడిమేళందొర కబురెట్టితే వెళ్ళా. పని పూర్తి చేసి బయలు దేరుతుంటే వీణె తంత్రులు బిగించమన్నారు. కాసంత ఆలస్యమయింది' వినయంగా చెప్పాడు నందనార్.

'గుడి యేమిట్రా గుడి. గుడికంటె పొలమే మీకు ముఖ్యం. గుడిలోనికి మిమ్మల్ని రానిస్తారా? పొలం దగ్గరయితే రానిస్తాం. ఆ గుడిమేళం దొరమాట ఇనకు. సెడిపోతావ్. వాళ్ళంతా తేరకు తినేవాళ్ళు. కట్టపడి బతికోళ్ళు మీరు. రెక్కల కట్టమే శాశ్వతం' అన్నాడు యజమాని.

అయ్యా! కోవెల లేని ఊర్లో కూడు వండకూడదని శాస్త్రం. ప్రతి మనిషి జీవితంలో ఒడి, బడి, గుడి శాశ్వతమని, ముఖ్యమని పంతులు సెబుతుంటే దూరాన నించోని విన్నా.

"అదంతా మీక్కాదురోయ్. పెద్దోళ్ళకు. మిద్దెలు మేడల్లోవారికి. గలగలా డబ్బులు లెక్కెట్టుకొనేవారికి" అన్నాడు మోరయ్య.

'మరి మేమూ' రంగయ్య అడిగాడు.

'పనీ పాట– పనీ పాట– పనీ పాట అంతే' నొక్కిచెప్పాడు మోరయ్య.

'అంతేనా? పని పూర్తయితే ఎకడయినా ఎళ్ళొచ్చా' కుతూహలంతో అడిగాడు రంగయ్య.

'ఎళ్ళొచ్చు. ఏం రోయ్? నీ మాట వింటుంటే అందరూ కలిసికట్టుగా ఉడాయించేలా ఉన్నారు. అదేం కుదరదు. మీ నాన్నల కిచ్చిన డబ్బెవడు తీరుస్తాడురా? జన్మజన్మలూ బాకీపడ్డవారే! గొంతు సవరించుకొని' చెప్పాడు యజమాని.

'అయ్యోరు! రంగయ్య ఏదో వాగాడు గాని పొలం పని చిటికెలో పూర్తి చేస్తాం. మాదో విన్నపం దొరా?' అన్నాడు నందనార్.

'అర్థదీ! మంచోని లక్షణం. చెప్పు తొందరగా' అడిగాడు యజమాని.

"మనవూరికి పదిమైళ్ళ దూరంలో 'తిరుప్పంగూర్' ఉందిగా. ఆవూరెళ్ళి" అని నందనార్ చెబుతుంటే యజమాని.

ఆ వూరెళ్ళి అక్కడ ఓ పిల్లను చూసి మనువాడతావా?

అయ్యోరు! జాతి సెడబుట్టినోణికి ఎవరు మాత్రం పిల్లనిస్తారు? హేళనగా గొంతు కలిపాడు మోరయ్య.

అది కాదయ్యా! నేనూ రంగయ్య, సోమయ్య అందరం కలిసి తిరుప్పంగూర్ వెళ్ళి శివయ్యను సేవించి వస్తాం.

'అయ్యగారూ! మీరు సై యంటే వీరంతా వెళ్ళి అక్కడే తిష్ఠవేస్తారేమో' సన్నగా గొణిగాడు మోరయ్య.

'ఒరేయ్ మోరయ్య! నీ భయం నీది. తిరుప్పంగూరు మా మేనమామ ఊరు. అక్కడే తిష్ఠ వేస్తే వూరు కొంటానా? కుక్కల్ని తరిమినట్టు అక్కడ నుండి తరిమి గొట్టించనూ... అయినా గుడికెళదామని చెబుతుంటే వెళ్ళొద్దని అనకూడదు. పాపం చుట్టుకొంటుంది. అమ్మగారికి తెలిస్తే నిన్నూ నన్నూ నానా మాట లంటుంది' అన్నాడు యజమాని.

'సరే! నందనార్! పని పూర్తి చేసుకొని వెళ్ళండి. ఒక్క రోజుమాత్రం అక్కడుండాల. అక్కడ ఆగారనుకో. తాట వొలిచేస్తా'. మా మేనమామ మీ పై ఒక కన్నేసి వుంటాడు. జాగ్రత్త.

'చిత్తం దొరా! అంతా శివుని దయ. పొద్దు వాలేసరికి పని పూర్తి చేసుకొని తెల్లారగట్ల తిరుప్పంగూర్ వెళదాం. పదండి పదండి'

**"ఎంత బాగ్యము ఎంత బాగ్యము**
**శివుని చూడగంటి మెంత బాగ్యము" ...**



**తిరుప్పంగూర్ పయనం**

ఉషోదయం కావచ్చింది.

నందనార్ ముందే లేచాడు. స్నేహితులను లేపాడు. వారందరు ఆదనూర్ దగ్గరలోని వంకలో స్నానం చేశారు. నొసట విభూతిని దిద్దారు. ఓం నమశ్శివాయ అంటూ కదిలారు. అయినా వారెవరికి తిరుప్పంగూరు దారి తెలియదు. దారిలో మనుష్యులు కనబడకపోతారా అని అనుకొన్నారు. కాని వారి ఆశ నిరాశ అయింది. ఎటు వెళ్ళాలో తెలియని తికమక. ఈ లోగా ఒక కాషాయంబరధారి అటుకేసి వచ్చాడు.

'ఎవరు మీరు? ఎటు వెళుతున్నారు?' అడిగాడు సన్యాసి.

మేము ఆదనూర్ వాళ్ళం. తిరుప్పంగూర్ వెళ్ళాలని బయలుదేరాం. మాకు దారి తెలియదు. మీరయినా చెప్పండి. ప్రాధేయపడ్డారు నందనార్ అతని స్నేహితులు.

ఆలాగే! నేనూ అటే వెళుతున్నాను. మీరు నాతో రండి.

ఈ మాట వినేసరికి నందనార్ స్నేహితులకు ప్రాణం లేచి వచ్చినట్లయింది. వారు సన్యాసిని వెంబడించారు.

'స్వామి! ఆ క్షేత్రవిశేషాలు చెప్పరూ' అడిగాడు నందనార్. ఆలాగే! 'తిరుప్పంగూర్ ప్రసిద్ధ శైవక్షేత్రం. ఈ క్షేత్రంలోని ఈశ్వరుడు శివలోకనాథన్. అమ్మవారు సొక్కనాయకి. ప్రసిద్ధ వైదీశ్వరన్ కోవిల్‌కు సుమారు 3 మైళ్ళ దూరంలో ఉంది. ఆ ఆలయ స్థలవృక్షం కానుగ. ఆ స్వామి ఉత్సవాలలో రథోత్సవం ప్రసిద్ధం. ఆ క్షేత్రం సామాన్యమయింది కాదు. నాయన్మార్లలో ప్రసిద్ధులయిన సంబందర్, సుందరర్, తిరునావుక్కరసర్‌లు మాత్రం కాదు దళిత వర్గానికి చెందిన ఎదుర్కోన్ కలిక్కామ నాయనార్ స్వామికి ఎన్నో సేవలు

చేసి తరించినవాడు. విభూతి అలంకరించుకొన్న వారి పాదాలు పెన్నిధులని భావించేవాడు. ఆ క్షేత్రదర్శనం పుణ్యప్రదం' అన్నాడు సన్యాసి. స్వామీ! మేము అజ్ఞానులం. మాకు శివలీలలు చెప్పరూ? ఆతృతగా అడిగారు నందనార్ స్నేహితులు.

ఆలాగే! వినండి. శివునికే భక్తవత్సలుడని పేరు. మహాదేవ నామం శివునికే. మరొక్కరికి లేదు. స్వామి కరుణామయుడు. పురాణాల్లోని ఒక కథ చెబుతాను.

'స్వామీ! చెప్పండి. చెప్పండి. మాకు కథలంటే ఎంతో యిష్టం' అన్నారు రంగయ్య, సోమయ్య.

శివలీలావిలాసాలెన్నో! ఒకసారి శివుడు 'పులి' అయ్యాడు.

స్వామి! మీరే స్వామి భక్తవత్సలుడన్నారు. పులి కావడమేమిటి? పులి క్రూరజంతువుకదా!

నిజమే. ఎందుకయ్యాడో చెబుతాను వినండి. అడవిలో ఒక ఆడజింక ప్రసవించింది. ప్రసవించాక ఆ ఆడజింకకు అంతులేని దాహం వేసింది. అంచేత తన జింకను వదలి దగ్గరి నదికేసి వెళ్లింది. నీళ్ళు తాగుతుంటే సరిగ్గా అదే సమయానికి వేటగాడు బాణం వేశాడు. జింకకు తగిలింది. జింక చచ్చిపోయింది. అక్కడేమో ప్రసవించిన జింక పాలకోసం తల్లికోసం తారాడుతుంది. శివయ్య చూచాడు. అతనికి జాలి వేసింది. తానే పులి అయ్యాడు.

'పులికీ జింకకు పడదుకదా! పులయితే పిల్లజింక జడుసుకోదూ' ఆశ్చర్యపడుతూ అడిగాడు రంగయ్య.

అక్కడే సిత్రం. తను ఆడుజింక కావచ్చు కాని అదే చిత్రం. అక్కడంతా పులుల సంచారం. అందుకే తల్లి పులి అయ్యాడు.



'అదేమిటబ్బ, పిల్ల జింక జడుసుకోదూ'? అడిగాడు సోమయ్య. పుట్టిన జింకకు అట్టే చూపులు ఆనవు. మగతలో ఉంటుంది. అందువల్ల 'ఆడపులై' తానే జింకకు పాలిచ్చాడు.

'బలే బలే వింతగా ఉంది' అన్నాడు రామయ్య.

ఇక్కడొక రహస్యముంది. జింకదగ్గర ఉండడం వల్ల ఏ పులి దగ్గరికి రాదు. అంతేకాదు. పులిరక్షణ వుందని ఆ పిల్ల జింకను ఇతర పులులు ఏమీ చేయవు.

ఇది గగుర్పొడిచే కథ. దీనుల పాలిట దేవుడే దిక్కు.

శివుడు పేదోళ్ళదేవుడు–అన్నాడు నందనార్

అవును నిజమే. ఇంకో కథ సెబుతా! 'వంది' అని ఒక దిక్కుమొక్కు లేని స్త్రీ. నదీతీరవాసం ఆమెది. ఏవో చిన్న వ్యాపారాలు. బుట్టతట్టలు అమ్ముకొనేది. అయినా శివభక్తురాలు. ఓ సారి నదికి ఉన్నట్టుండి వరదలు వచ్చాయి. గట్టు దాటి ఉరకలు వేసింది. వంది ఒడ్డున పేర్చుకొన్న బుట్టతట్టలన్నీ కొట్టుకు పోయాయి. శివ శివా! నాకు నీవే దిక్కంది. శివుడు విన్నాడు. వెంటనే తానే కూలివాడయ్యాడు. వందివున్న గుడిసెవైపు వరదలు పారకుండా తట్టల్లో మట్టి పోసి అడ్డకట్ట వేశాడు. వంది ఎవరో అనుకుంది. శివశివ అంది. అపుడు కూలి 'అమ్మా! నా పేరు శివయ్య' అన్నాడు.

"స్వామీ! ఈ నదీ తీరమంత బంగారంలా మెరసిపోతుందే. కారణం చెప్పరూ" అడిగాడు నందనార్ నడుస్తూ.

అవును. నిజమే! శివుని ఆజ్ఞలేక చీమయినా కదలదు! శివుడనుకుంటే అంతా స్వర్ణమయం అవుతుంది. అంతే కాదు. సత్‌సంకల్పానికి దేవుడు సరే అంటాడు. ఈ నదీ తీరంలో పొన్నమ్మాల్ అనే ముసిలావిడ ఉండేది. తమిళంలో 'పొన్' అంటే బంగారం. బంగారమ్మ అని అర్థం. ఆవిడ ఈ నది ఒడ్డులోని

శివలింగానికి బంగారు కవచం అర్పించాలనుకొంది. తన పేరులో 'బంగారం' ఉండవచ్చుగాని చిల్లిగవ్వ చేత లేదు. అందుకే స్వామి? నా కోరిక తీరడానికి నీవే మార్గం చూపించు అని చేతులు జోడించింది. 'సంకల్పం నాది, సేవ నీది' అంది. అంతే. ఆ నదీ తీరమంతా బంగారు రేణువులుగా మారిపోయింది. అంతేకాదు. ఇంట్లో పాత్రలు బంగారమయ్యాయి. ఆ బంగారంతో కవచం చేయించింది. ఆ కవచం తయారీవేళ రాలిన పొడి ఇక్కడ స్వర్ణ రేణువులుగా కనిపిస్తున్నాయి. స్వామి ప్రాణదాత కాదు. ఐశ్వర్యప్రదాతకూడా. 'విభూతి' అంటే ఏమనుకొంటున్నారు? విశిష్టమయిన భూతి. భూతి అంటే ఐశ్వర్యం. మార్కండేయుని చిరంజీవిని మృత్యుంజయుని చేసింది శివుడే. బెజ్జ మహాదేవికి కొడుకుగా మారినవాడూ శివయ్య. సిరియాళుని తండ్రి చిరుతొండనంబిని పరిరక్షించినవాడు శివయ్య. అంతెందుకు? క్షీరసాగరమథన సమయంలో హాలాహలం మ్రింగినవాడూ శివుడే. ఒక అత్త తన కుమారుడు శైవస్త్రీని పెళ్ళాడినాడని కసురుకొందట. అందుకే పిల్లలు పుట్టలేదని దెప్పిపొడిచేదట పాపం! కొడుకు తనలో తాను కుమిలి పోయేవాడు. భర్తమీది మమకారంతో ఆ శైవాంగన ఏమీ అనలేకపోయేది. చివరకు శివయ్య తానే ఆ ఇంట్లో 'కొడుకుగా' పిల్లవానిగా మారిపోయాడట.

'బలే! బలే! బాల గంగాధరుడన్నమాట', ఎగిరి గంతేశాడు రంగయ్య. అందరు కలిసి నడుస్తున్నారు. దూరంలో ఒక చోట గుడి దగ్గర సత్రం కనబడింది. అక్కడ శివాలయముంది. ఒక పులి బిడ్డను కాపాడుతున్నట్టుగా విగ్రహాలున్నాయి. అక్కడే అందరు విశ్రాంతి తీసుకోవాలనుకొన్నారు.

స్వామి! ఎన్నో కథలు చెప్పారు. మరి ఈ గుడికథ చెప్పరూ! బతిమాలే రీతిలో అడిగారు సిత్రంగా రంగయ్య, రామయ్య.



ఆలాగే! చెబుతాను. ఒక వర్తకుడుండేవాడు. ఆతనిది వక్కల వ్యాపారం. అతనికి పెళ్ళయింది. ఎంత కాలమయినా వారికి సంతానం కలగలేదు. చివరకు శివవ్రతం చేశారు.

'స్వామి! కొడుకు పుడితే నీ పేరెట్టు కొంటాము. గుడి కడతాము' అని మొక్కుకొన్నారు. శివయ్య వారి కోరిక మన్నించాడు. ఆ దంపతులకు మగపిల్లవాడు పుట్టాడు. 'శివయ్య' అనే నామకరణం చేశారు. ఇంతవరకు బాగుందిగాని గుడికట్టడం మరచిపోయాడు.

కొన్నాళ్ళకు ఆ దంపతులు పొరుగూరు వెళ్ళవలసివచ్చింది. పిల్లవానిని చంక కెత్తుకుంది తల్లి. మగనితో బయలు దేరింది. దారిలో అడవి. ఆ అడవి మార్గంలో వెళుతున్నారు. అలసట ఎక్కువ అయింది. దగ్గర చిన్న బావిలాంటి జలాశయం. అక్కడ ఆగారు. పిల్లవాణ్ణి గడ్డమీద గుడ్డవేసి పడుకోబెట్టారు. తెచ్చుకొన్న అన్నం తినడం మొదలెట్టారు. అపుడే 'ఒక పులి' అటుకేసి వచ్చింది.

వక్కల దంపతులు పులిని చూచి భయపడి కాళ్ళకు బుద్ధి చెప్పారు. పిల్లవాని సంగతి మరచిపోయారు. కాసేపయ్యాక ఆ దంపతులు గాబరాకు లోనయ్యారు. పులి పిల్లవాణ్ణి తినేసిందేమో అని భయపడ్డారు. ఇద్దరు పరుగెత్తు కొంటూ ఆ జలాశయం దగ్గరికి వచ్చారు.

పిల్లవాడు కాళ్ళుచేతులూపుతూ పులికేసి చూస్తున్నాడు. పులి ఆ పిల్లవానికి కాపలాగా ఉంది. వక్కలవానికి ఉన్నట్టుండి తన మొక్కు గుర్తుకు వచ్చింది.

స్వామి! మేము పాపులం. మొక్కు తీర్చడం మరచిపోయాం. మా పిల్లవానిని మాకు వదలిపెట్టు స్వామి! నీకు తప్పక ఇక్కడ గుడి కట్టిస్తాం. అని చేతులు జోడించారు.

అంతే పులి ఆ దంపతుల్ని చూచి మెల్లగా వెనక్కి తిరిగింది. ఇదే ఇక్కడి కథ అని ముగించాడు స్వామి. దూరంలో తిరుప్పంగూర్ కోవెల గోపురం

కనబడుతూవుంటే స్వామి తనతో వచ్చిన వారిని చూచి "నేను మార్గదర్శకుని మాత్రమే. మీరు ఇటుకేసి వెళ్ళండి. నందనార్! నీలో ఏదో అద్వితీయ శక్తి ప్రకాశిస్తూవుంది. ఏదో దైవకార్యం నీ వల్ల సాధింపబడుతుంది. ఇక నేను నా దారివెళతా" అని అభయహస్తంతో అంతర్ధానమయ్యాడు.

"ఒరేయ్! స్వామి మామూలు కాషాయస్వామి కాదురోయ్. సాక్షాత్తు మనకోసం ఈ ఏషంలో వచ్చారేమో"

నందనార్ అంతర్ధానమయిన ఆ స్వామి దిక్కుకేసి సాగిలబడి మ్రొక్కి తిరుప్పంగూర్ వైపు స్నేహితులతో పయనమయ్యాడు. తిరుప్పంగూర్ పొలి మేరకు చేరగానే గాలిగోపురం కనిపించింది. ఆ గోపురం నందనార్ స్నేహితులకు కలలా కనిపించింది. దగ్గరికి రమ్మని చేతులు చాచినట్లు భావన కల్పించింది. అందరూ పరవశులయ్యారు. ఆనందబాష్పాలు రాల్చారు. తమ జన్మ ధన్యమయిందని భావించారు. ఆ రోజే స్వామిని సేవించాలని తపించారు. దగ్గరి నదిలో పుణ్యస్నానమాచరించారు. గుడికేసి నడిచారు. గుడిలోని పూజారుల 'నమశ్శివాయ' మంత్రం వినబడుతుంటే అంతులేని ఆనందమనుభవించారు. 'శివశివ మహాదేవ శంభో శంకర' అంటూ భక్తులు కదలుతుంటే నందనార్ అతని స్నేహితులు 'ఓం నమచ్చివాయ ఓం నమచ్చివాయ' అని జపిస్తూ గుడి ప్రధానద్వారం దాటారు. మెల్లగా కదలి ధ్వజస్తంభందాకా వెళ్ళారు.

### నందీశ్వరుడు పక్కకు తొలగడం

అంతే! ఆపై అడుగు పడలేదు. గుడిలోపలికి వెళ్ళేవారు నందనార్‌ను అతని స్నేహితుల్ని తీక్షణంగా చూడసాగారు. వారి చూపుల్లో గర్వం ఉంది. వారి వీక్షణాలలో తిరస్కారముంది. వారి దృగ్జాలంలో అసహనముంది. మనతో సమానమా అనే ఏహ్యాభావముంది. నందనార్ పరిశీలించాడు. స్నేహితుల్ని వారించాడు. అంత్యజులకు ఆ కాలంలో ధ్వజస్తంభందాకే ప్రవేశం. నందనార్



ఆగాడు. శివ దర్శనం కాలేదు. పైగా నంది అడ్డు. ఎంతో ఆశతో వచ్చిన స్నేహితులకు నిరాశ, కలవరం, కల్లోలం. నందనార్ తమ వారిని చూచాడు. శివాలయం గర్భగుడివైపు తేరిపారచూచాడు. దారిలో సన్యాసి చెప్పిన కథలు గుర్తుకు వచ్చాయి. భక్తవత్సల నామం నిజమయితే తమకు దర్శనం తథ్యమనుకొన్నాడు.

"శివ శివా! ధ్వజస్తంభందాకా వచ్చాం. ఈ జన్మలో మనకింతే అర్హత. అయినా మేం ఏం పాపం చేశాం? స్వామి పూజల వేళల్లో వాయించే వాద్యాలకు వస్తుసామగ్రి సమకూర్చడం లేదా? గాయకులు పాడే వీణాది వాద్యాలకు తంతులు మార్చడం లేదా? ఊరేగింపులో పాలు పంచుకోవడం లేదా? స్వామికి భక్తులు సమర్పించిన మాన్యాలలో చెమటోడ్చి నైవేద్యం కోసం పంటలు పండించడం లేదా? నిన్ను దర్శిద్దామంటే 'నంది' అడ్డుగా ఉన్నాడే? అని పరితపించాడు నందనార్. స్వామి! మేమంటే కోపమా. ఆదనూర్‌నుండి ఆది దేవుని దర్శించడానికి వచ్చినవారం. మేము రాచరికం అడగలేదు. ఆపదల్లో మాత్రం మొక్కేవాళ్ళం కాదు. నీకు కానుకలు ఇవ్వలేనివారం. పెద్ద పెద్ద వరాలు కోరేవారం కాము. మేమడిగినదల్లా ఒకటే. నీ దర్శనం మాత్రమే అన్నారు నందనార్ స్నేహితులు. స్నేహితుల మాటలు, ప్రార్థనలు, అకుంఠిత దీక్షను అర్థం చేసుకొన్నాడు నందనార్.

'నీ దర్శనం చేసుకోనిదే మేము తిరిగివెళ్ళం. నీ దివ్య దర్శనంతో తరించడమో లేదా అంతరించడమో ఈ వేళ తేలిపోవాలి. ఇదే మా నిర్ణయం. భక్తవత్సలా! కరుణించు' అన్నాడు నందనార్.

'ఊరికెళితే దర్శనమయిందా అంటే ఏమని చెప్పాలి? యజమాని కస్సుబుస్సుల మనిషి. ఎటకారం చేయడూ' బాధపడ్డారు నందనార్ స్నేహితులు.

ప్రార్థన ఒక్కటే శరణ్యం.

**'పంచాక్షరీమంత్రం పావనమంత్రం. పాపరాశిని**
**పటాపంచలు చేసే మంత్రం**
**భక్తజన రక్షక మంత్రం**
**భవబంధ విమోచకమంత్రం**
**పంచముల రక్షించే మంత్రం**'–అని పాడుతుంటే

నంది పక్కకు తొలిగాడు. ఈ దృశ్యం చూసిన వారంతా దిగ్భ్రమ చెందారు. తమలో తాము అనేక రకాలుగా తర్కించుకొన్నారు. నందనార్ అతని స్నేహితులు అక్కడనుండి శివదర్శనం చేసుకొన్నారు. తమ జన్మ ధన్యమయిందని భావించి వెలుపలికి వచ్చారు. గుడి ఆవరణలో ఒక చిన్న గుంటను చూశారు. నందనార్‌కు ఆశ్చర్యం వేసింది. ఆ బాటవెంబడి వెళ్లేవారిని అడిగాడు ఏమిటని?

మీరు ఈ వూరికి కొత్త వారేమో? ఇక్కడ పెద్ద కోనేరు ఉండేది. ఈ కోనేరులో స్నానం చేసి భక్తులు వెళ్లేవారు. అదంతా పాతకథ. కాలక్రమంలో మెట్లు సడలిపోయాయి. కోనేటి మట్టిగోడలు కరిగి పోయాయి. ఆలన పాలన లేక చివరకు ఈలా అయింది. మా తాతల కాలంలో ఈ తీర్థ మహిమలు ఎన్నో మా నాన్న చెప్పేవాడు. ఏం చేద్దాం. అంతా భగవదిచ్ఛ. మనం అతని చేతిలో కీలుబొమ్మలం. అంతే. నిట్టూరుస్తూ భక్తుడు వెళ్ళాడు.

మనం తవ్వలేమా? గునపాలతో పారలతో కాలం గడిపే వాళ్ళం. మనకు స్వామి దర్శనమిచ్చాడు కదా? అంతే చాలు. కృతజ్ఞతగా ఈ గుంతను విశాలం చేద్దాం. కోనేరు నిర్మిద్దాం. ఏమంటావ్ నందా అన్నాడు వీరయ్య.

"సమైక్యమే బలమయితే
సాధించని దేముంది?
గంగాధరునికి నీళ్ళే కరువా?
కష్టపడేవారికి పని ఒక బరువా"



కైలాసంలో పార్వతీపరమేశ్వరులు ఈ దృశ్యం చూస్తున్నారు. పరవశించారు. పంచముల భక్తిని పవిత్రకర్మను మనసా మెచ్చుకొన్నారు. అయినా పార్వతి భయపడింది.

'స్వామి! పసికందులు గునపం పట్టడమేమిటో? లోతయిన కోనేరు తవ్వడం సాధ్యమా? ఆ గుంతలో పడితే ప్రాణాలు పోవూ. అయినా ఈ నలుగురయిదుగురు ఈ పని చేయగలరా?' అంది.

'పార్వతీ! బాలశక్తి ప్రభంజనం కంటె బలీయం. బాలుర సంకల్పం హిమవన్నగంకంటె సుదృఢం. నీ కా భయమఖ్ఖర్లేదు. మన ప్రమథగణ మంతా భక్తవేషంలో సహకరిస్తారు' అన్నాడు.

అంతే! తిరుప్పంగూర్ ఆలయం దగ్గర కోలాహలం. ఎక్కడనుండో తీర్థప్రజ వచ్చారు. నందనార్‌ను చూశారు. ఈ క్షేత్రంలో గునపం పట్టడం సంప్రదాయమను కొన్నారు. ఊరోళ్ళు గునపాలు, పారలు ఇచ్చారు. అందరూ కోనేటిపని మొదలెట్టారు.

ఒకరోజులో పని పూర్తయింది.

కోనేరు సిద్ధమయింది.

భక్తాదులు చీకటిలో మాయమయ్యారు.

ఊరోళ్ళు 'ఈ సంవత్సరం తెప్పతిరునాళ్లు ఈ కోనేటిలోనే' అంటూ సంతోషంగా కదిలారు.

'నందనార్! పొద్దుపోయింది. ఇపుడు బయలు దేరితే గాని రేపటికల్లా ఆదనూర్ చేరుకోలేం.' అన్నాడు వీరయ్య.

'నిజమే! వెళ్ళాలి. దారి మనకు తెలుసుగా' పదండి పదండి యజమాని చీవాట్లు పెట్టకముందే మనూరు ఎళదాం అంటూ పరుగు లాంటి నడక అందుకొన్నారు.

## నందనార్ చిదంబరం చింత

ఆదనూర్ పొలాల దగ్గర ఖామందు మోరయ్యతో మాట్లాడుకొంటూ నడుస్తున్నారు.

ఏరా! మోరయ్య! నేను నెలరోజులపాటు వూళ్ళో లేనుగదా! ఏమిటీ విశేషాలు?

ఏముందయ్య గారూ! షరా మామూలే!

"అవును గాని. తిరుప్పంగూర్ వెళ్ళిన వాడవాళ్ళు వచ్చారా? ఆ నల్లోడు ఎలా ఉన్నాడు?"

"ఆ వచ్చారుగాని, తొండ ముదిరి ఊసరవిల్లి అయినట్టు ఆ నందనార్ వాలకమే అంతుపట్టడం లేదు?"

'ఏం?'

"మొన్న మనూరిలో గ్రామ జాతర జరుగుతూంటే కోళ్ళను బలివ్వకూడదని అడ్డుతగిలాడట."

"అదెలా కుదురుతుంది? తరతరాలనుండి వస్తున్న గ్రామసంప్రదాయం".

"ఊరోళ్ళు పదేపదే చెబితే కూడా యినలేదట".

ఆ తరువాత?

"అతన్ని సెట్టుకు కట్టి ఆ తర్వాత జాతర యథాప్రకారం జరిపించారట".

అద్గది. బాగుంది. చల్లని మాట చెవిలో వేశావ్. మోరయ్యా! ఏం జరిగింది?

"నల్లోడు పూనకం వచ్చినవాడల్లా వూగిపోతూ సిదంబరం యెళతా అన్నాడట."



"వెళ్ళిపోయాడా? కొంపదీసి, వెళ్ళిపోతే పొలంపని చేసేవాడెవడు? చూసేవాడెవడు?"

మోరయ్యా! ఏమాటకామాట సెప్పుకోవాలి గానీ, నందనార్ ఒళ్ళొంచి బాగా పనిచేస్తాడు. ఆ తర్వాత ఏం జరిగింది?"

"నేనే ఖామందుకు సెప్పి వెళ్ళు అన్నా. మంచిపని చేశావులే. ఆ తర్వాత!"

రేపెళతా, రేపెళతా అని అంటున్నాడు. మరి స్నేహితులు అడిగితే కూడా రేపెళతా అన్నాడట. అందరూ తమిళంలో "నాళై పోవార్, నాళై పోవార్" అని పరిహాసం చేస్తుంటే దిగాలు మొహం పెట్టాడట.

"ఓరెయ్ మోరయ్యా! నీవు చెబుతున్నవైనం వింటుంటే ఆడు ఎళ్ళేట్టే వున్నాడు. ఎటయినా వెళ్ళకుండా చూడాలి. అది నీ బాధ్యత."

"అలాగే! అదిగో. మాటాడుతుంటే నందనార్ మనకేసి వస్తున్నాడు."

నందనార్ 'శివ శివా' అంటూ నడిచి వస్తున్నాడు. యజమాని కనబడగానే సవినయంగా నమస్కారం చేశాడు.

నమస్కారానికేం తక్కువ గానీ, సంగతేంటీ?" గర్జించినట్లు అడిగాడు యజమాని.

అయ్యా! చిదంబరంలో ఆర్ద్రా నక్షత్రం తిరునాళ్ళంట. ఈసారెళ్ళి దర్శనం చేసి వద్దా మనుకుంటున్నా అని భయపడుతూ చెప్పాడు.

ఏటీ! సిదంబరమా? అదేమీ ఆదనూరనుకున్నావా? లేదా, తిరుప్పంగూరనుకున్నావా?

పంచభూతాల శివక్షేత్రాలలో చిదంబరం ఆకాశక్షేత్రం, నటరాజక్షేత్రం, తిల్లై గోవిందరాజస్వామి సాక్షాత్కరించిన వైష్ణవక్షేత్రం.

ఏవిట్రా! నాకే చెబుతున్నావ్. నేను చెబుతా విను. ఆ క్షేత్రానికి నీవు వెళ్ళడానికి వీల్లేదు. నిన్ను వెళ్ళనిస్తే ఈ ఊరోళ్ళు నన్ను వెలివేస్తారు. చెప్పరా మోరయ్యా!

"అవునవును. చిదంబరంలో మూడువేలమంది బ్రాహ్మణులు ఉన్నారు. వారెపుడూ వేదమంత్రాలతో యాగాలు చేస్తుంటారు. ఆ మంత్రాలు నీవు వినకూడదు. యాగవేదికలున్నచోటకు పోకూడదు. పాపం చుట్టుకుంటుంది" అని వంతపాడాడు మోరయ్యా.

"అంతేకాదు. పంచలింగాలలో సిదంబరం ఆకాశలింగం కదా! అక్కడేముంది? ఆ ఆకాశాన్నీ ఇక్కడుండి చూడొచ్చుగా!" అని యజమాని చిరాగ్గా బదులిచ్చాడు.

"నిజమే తిరునాళ్ళు చూడాలనుంది. మిరపసేను కాపలా ఎవడు కాస్త్రాడ్రా?" కళ్ళు ఉరిమేలా చూశాడు యజమాని.

"అక్కడ నీకు అన్నంబెట్టే వాడెవడ్రా? అన్నం దొరక్క అక్కడే చస్తావ్" భయపెట్టాడు మోరయ్య.

నీవు ఆలయప్రవేశానికి అనర్హుడివి. ఈ నియమాన్ని నీ ముత్తాతల కాలం నుండీ అందరూ పాటిస్తూంటే, ఆ కట్టుబాటు మీరతావట్రా! నీ కళ్ళు పోతాయ్.

కనీసం ఈ మాటంటే ఆగిపోతాడేమో అని యజమాని అనుకున్నాడు.

అయ్యా! కనీసం వారం రోజుల వ్యవధివ్వండి. వెళ్ళొస్తాను.

ఒరేయ్! మోరయ్యా! వీడు నిజంగా వస్తాడంటావా? అసలే వీడికి శివపిచ్చి. తిరుప్పంగూర్ వెళ్ళాక మరీ ముదిరింది. మరి ఏం చేద్దాం?

నందనార్ చెవిలో పడకుండా యజమాని సన్నగా గొణిగాడు.

"అయ్యా! అపుడయితే స్నేహితులతో వెళ్లాడు. ఇప్పుడు ఒక్కణ్ణి మాత్రం పంపుదాం."

ఉపాయం చెప్పాడు మోరయ్య.



"భలే భలే" నీకీమధ్య చురుకుదనం పెరిగిందిరోయ్. నన్నే మించేట్టున్నావ్---ఒరే నందనార్! ఇంతగా అడుక్కుంటున్నావ్ గనక నీకు మూడు రోజుల వ్యవధి ఇస్తున్నాను.

"అయ్యా! ఎంతయినా మీరు దయాస్వభావులు. అయితే అయ్యగారి పొలం దున్ని పంట పండించి కోత కోసి కుప్పపోసి మూడురోజుల్లో దాన్ని యింటికి చేర్చాలి" అంతే! నవ్వుతూ చెప్పాడు మోరయ్య.

"నీవు శివభక్తుడవు కదా! నీకు సాధ్యం కాని దేముంది? నీ భక్తే నిజమైతే మా కోరికా నెరవేరుతుంది. నీ చిదంబరయాత్రా సఫలమవుతుంది" రాగాలు తీశాడు.

"అయ్యగారూ! నన్ను నిందించినా పర్వాలేదు. నా శివభక్తిని మాత్రం అవహేళన చేయకండి. ఆ పరమశివుడే నాకు సర్వరక్ష. మాట తప్పరు గదా! అయ్యా!"

మాట తప్పడమేమిట్రా! మన అయ్య నిఖార్సయిన మనిషి. ఏం చెబితే అంతే. శిలాక్షరం. తిరుగుమాట లేదు. నేను పూచీకత్తూ. అయ్యగారు సెప్పినట్టు సెయ్. వెకిలిచేష్టలతో మోరయ్య బదులిచ్చాడు.

"అలాగే. నేను పొలంకేసి నడుస్తా".

నందుడు పొలమంతా కలియ చూశాడు. దీన్ని సాగుచేయడం ఎలా? బావేదీ? నీళ్ళేదీ? కాలువలెక్కడా? తడి లేకపోతే దున్నే దెలాగా? దున్నినా నారెక్కడా? నారున్నా ఒక్కడే నాటడం సాధ్యమా? ఆ నారు పెరిగేదెప్పుడూ? వరి వెన్నుదాకా ఆగడం సాధ్యమా? పోనీ కోతంటే సామాన్యమా? పనివాళ్ళు వస్తారా? పని చేస్తారా? వరికట్టలు బండమీద వేస్తారా? కాస్తా తడి ఆరాక కట్టకట్టగా బండకేసి బాదాలా! వరి ధాన్యం రాలాలా! రాలిన వరికుప్పలు

తూర్పారా బట్టాలా! ఆ పైన బస్తాల్లో వేసి యజమాని ఇంటికి చేర్చాలా! నందనార్‌కు మైకం కమ్మినట్టయింది.

"శివ శివా"! అంటూ నేలమీద సొమ్మసిల్లి పడిపోయాడు. మగత నిద్ర పట్టింది. ఆ నందుని పట్టించుకున్నవారే కనబడలేదు.

**'కళ్ళాలలో' కైలాసనాథుడు**

కైలాసంలో పార్వతీపరమేశ్వరులు. పార్వతి ఒక్కసారి ఉలిక్కిపడింది.

'భక్తవత్సలా! ఇదేమి పరీక్ష'

నందనార్ గురించేనా నీ ఆందోళన. ఇపుడేమయిందని నీ బెంగ. మిమ్మల్ని సదా స్మరణ చేసేవానికి, ఆలయకైంకర్యంలో పాలు పంచుకొనేవానికి ఇంతటి కఠోరపరీక్షనా?

నగజా! సందేహించకు. భక్తుల నమ్మకాలను నేను సదా సంరక్షిస్తాను.

స్వామీ! ఇది మార్కండేయుల ప్రాణరక్షణలాంటిదా? సిరియాలుని బతికించడం లాంటిదా? తిన్ననికి కన్నివ్వడం లాంటిదా.

కావచ్చు హిమగిరితనయా! ధైర్యం, స్థైర్యం ఉంటే చాలు. రెండూ నందునికి వున్నాయి. అతనికి పరివారం లేదని కదా నీ చింత? మనం లేమూ. భక్తునికి దాసానుదాసులు.

స్వామి! నందనార్ మగతనిదురలో ఉన్నాడు. మనమే యజమాని పని కానిస్తే?

ఆలాగే! కైలాసం కైలాసం ఆదనూర్‌కు కదలిపోతోంది.

నీవు దిగులుపడవద్దు. సర్వం సఫలమవుతుంది.

అంతే! కైలాసం శూన్యమయింది.



ఆదనూర్‌లో ఎక్కడ చూచినా పంటకూలీలే.

భోళాశంకరుడు నాగలిపట్టాడు. పార్వతి నీళ్ళు తోడసాగింది. వినాయకుడు విత్తనాలు చల్లాడు. కార్తికేయుడు కలుపు తీశాడు. ప్రమథగణమంతా పెరిగిన పంటను కోసింది. మోపులు కట్టింది. అష్టదిక్పాలకులు తలా ఒకపని అందుకొన్నారు. వెన్నులనుండి ధాన్యం వేరుచేశారు. నందీశ్వరుడు మూటలు గట్టి ఆ మూటలపై తన ముద్ర వేశాడు.

తెల్లవారుతున్నది.

నందనార్ ఉలిక్కిపడి లేచాడు.

ఎదురుగా ఒక రైతు.

'నందనార్! లే! ధాన్యం బస్తాలు యజమాని ఇంటికి చేర్చు. నే వెళ్ళొస్తా'. చూస్తుండగనే మాయమయ్యాడు. నందుడు దిగ్భ్రాంతిలో పడ్డాడు. తాను సొమ్మసిల్లి నేల వాలడం తెలుసు. మగతనిద్ర కమ్ముకోవడం తెలుసు. కైలాసాధిపతి కరుణించాడన్నమాట. కనికరించి తానే భూలోకానికి వచ్చాడన్నమాట.

స్వామి! భక్తవత్సలుడంటే నీవేనయ్యా!

అదిగో మోరయ్యా! ఇటు చూడు ధాన్యం బస్తాలు. పట్టుకెళ్ళు. ఇంక నేను సిదంబరం వెళతా. నన్ను ఆపగలవారెవరూ లేరు అన్నాడు నందనార్.

అవును. నిజమే. నందనార్ సామాన్య భక్తుడు కాడు. దేవతాంశ సంభూతుడు. ఇతనికి అపకారం చేస్తే కళ్ళుపోతాయి. వంశం వంశం వల్ల కాడవుతుంది. ఇపుడే వెళ్ళి యజమానికి చెబుతా. మోరయ్య ఆదనూర్ కేసి వెళితే నందనార్ చిదంబరం కేసి నడిచాడు.

## నందనార్ చిదంబరదర్శనం

నందనార్ చిదంబరం చేరాడు. అక్కడ పారే నదిలో స్నానం చేశాడు. నొసట విభూతి అలదుకొన్నాడు. దూరాన కనిపించే గోపురానికి దండం పెట్టాడు. గుడికేసి నడిచాడు. గోపురందగ్గరికి రాగానే రక్షకుడు అడ్డుపెట్టాడు.

'ఎవరు నీవు?'

'నేను నందనార్'

ఏ వూరు నీది?

'ఆదనూర్ దగ్గర వాడ.

చూస్తే నీవు అంత్యజుడవుగా ఉన్నావ్?'

'మీ చూపులో అంత్యజుడను కావచ్చు. నేను శివభక్తుణ్ణి. పైగా తిరుప్పంగూర్‌లో స్వామిదర్శనం చేసుకొన్నవాణ్ణి.'

'అదంతా నాకు తెలియదు. నీవేం చేస్తుంటావ్?'

స్వామి మాన్యాలలోనే వ్యవసాయం చేస్తుంటా! ఆలయవాద్యాలకు తోలు సమకూర్చడం, బిగబట్టి కట్టడం నా పని.

అంటే ఆలయకైంకర్యమన్నమాట.

'అవును! అందుకే ఆలయంలోపలికి నన్ను వెళ్ళనివ్వండి!'

'వీల్లేదు. నీకు అర్హత లేదు.'

'నేను శివభక్తుణ్ణి. నన్ను లోపలికి పంపండి'

సుతరామూ కుదరదు.



స్వామి! ఇదేమి పరీక్ష!

'నీవు మలినుడివి'

'కాదు. ఇపుడే నదిలో స్నానం చేసి వచ్చా'

'నీ పుట్టుక మలినం'

'అందరి పుట్టుకలు మలినంలోనే'

'నీ వాసం మలినం'

'ఇదిగో ఆలయం చుట్టూ మలినం లేదా? అపరిశుభ్రత మీకు కనబడలేదా?'

'ఏమిరా? మాటకు మాట బదులిస్తున్నావ్. వెళ్ళు అవతలికి.'

"ఎందుకు వెళ్ళాలి? కర్మఫలం మలినం. కామక్రోధాదులు మలినం. ఈ మలిననిర్మూలనంకోసమే భక్తిపవిత్రతకోసమే స్వామిసందర్శనం."

'కావచ్చు! నీవు పవిత్రుడవు కావు.'

"ఆకాశజలం పవిత్రం. పూలనుండి వీచే గాలి పవిత్రం. అగ్ని పవిత్రం. ఆత్మ పవిత్రం. మానవత్వం పవిత్రం"

అపుడే ఆలయాధికారి అర్చకులతో అటుకేసి వచ్చాడు. గోపురరక్షకుడు అంతా చెప్పాడు.

ఏరా! అగ్ని పవిత్రమన్నావు కదా? సీతమ్మ అగ్గిలో దూకి పాతివ్రత్యం నిరూపించుకొంది. తెలుసా!

ఆలాగా! అట్టయితే నేనూ దూరితే పవిత్రుణ్ణి అవుతానా? అవును. అగ్ని పాపనిర్మూలకుడు, సర్వభక్షకుడు. నీవు అగ్గిలో దూకి పరిశుద్ధుడవయితే ఆలయ దర్శనం చేసుకొందువు గానీ.

"పెద్దలారా! నేను మలినుణ్ణి. నేను అగ్నిలో దూకితే అగ్ని మలినం కాదా?"

"ఎపుడూ కాదు. నీ మాలిన్యం పొగరూపంలో పైకి వెళ్ళిపోతుంది. ధగద్ధగాయమానంగా వెలిగిపోతావ్"

అవునా! సరే! మీ పరీక్షకు సిద్ధం.

తిరుప్పంగూర్‌లో నంది పక్కకు తప్పుకోవడం, ఆదనూర్‌లో స్వామి తానే రైతయి ధాన్యరాశి సమకూర్చడం అన్నీ కళ్ళముందు మెదలుతున్నాయి.

రేపే! సుముహూర్తం. ఆలయం కుడివైపున అగ్నిగుండం. ఉదయమే స్నానం చేసి రా. ముందు అగ్నిప్రవేశం. ఆ తరువాత నటరాజదర్శనం.

ఆలయాధికారులు హుకుం జారీచేసి చల్లగా జారుకొన్నారు. ఈ హడావిడి చూస్తున్నవారంతా నందనార్ చుట్టూ చేరారు.

"నందనార్! నీ కేమయినా పిచ్చి పట్టిందా? అగ్గిలో దూకితే కాలిపోతావ్. బూడిదయి పోతావ్. ఆ తర్వాత పవిత్రుడు కావడమేమిటి? ఇదంతా ఆలయాధికారుల కుట్ర.

వెళ్ళిపో! వెళ్ళిపో! నీ ఊరెళ్ళి పో. గోపురదర్శనం చేస్తే స్వామి దర్శనం చేసినట్టే. అనవసరంగా పంతాలకు పోయి ప్రాణంమీదికి తెచ్చుకోకు.

"ఇపుడు ఆదనూర్‌లో ఆలయకైంకర్యం చేస్తున్నావుగా. ఈ జన్మకు చాలు. మరోజన్మలో అగ్రకులంలో పుడతావులే. అపుడు స్వామి దర్శనం చేసుకొందువుగానీ"

"ఏమిటి? ఆలయం పక్కన అగ్నికుండమా? అగ్నిగుండాలు గ్రామదేవతల పరిసరాల్లో గాని చిదంబరంలో లేదే! కనీ విని ఎరగని ఆచారం. ఆలయం అపవిత్రమయి పోదూ? నీవు అపవిత్రతకు కారణం కావద్దు. ఇంకా నీచ జన్మ వస్తుంది. వెళ్ళిపో, వెళ్ళిపో"



'నేను వెళ్ళను. నాకు వచ్చిన అవకాశం వదలుకోను ఆదనూర్ వెళితే అందరూ పరిహసించరూ! ఆలయ దర్శనమో, ఆత్మార్పణమో ఇక్కడ ఆకాశలింగక్షేత్రంలోనే'

నందనార్ చిందులు తొక్కుతుంటే చేసేదిలేక పురజనులు తమ యిండ్లకేసి నడిచారు.

**నందనార్ శివైక్యం**

మరుసటిరోజు

ఆలయం పక్కన అగ్నిగుండాలు.

అగ్నిజ్వాలలు ఆకాశాని కెగురుతున్నాయి.

అర్చకులు అగ్నిసూక్తం పఠిస్తున్నారు

నందనార్ ముమ్మార్లు గుండం చుట్టివచ్చాడు.

అందరికి నమస్కరించాడు.

అగ్నిలో దూకాడు.

అర్చకులు 'నందనార్' ఇంత సాహసం చేస్తాడని అనుకోలేదు.

నివ్వెరపోయారు.

పౌరులు కంట తడిపెట్టుకున్నారు.

అయినా అదేమి ఆశ్చర్యమో!

అగ్నికీలలు శాంతించాయి.

ఆ మంటలు పూలహారాలయినాయి

నందుడు వెలుగులు విరజిమ్ముతూ నిలిచాడు.

నటరాజ కృపావిశేషం నందునికి అర్థమయింది.

నిజమయిన భక్తి ఏమిటో అర్చకులకు అవగతమయింది.

అర్చకులు నందనార్‌ను ఆహ్వానించారు.

ఆలయ ప్రధానగోపురం చేరుకొన్నారు.

నటరాజదర్శనం తనకు సులభసాధ్యమవుతున్నది.

ఆనందాశ్రువులు రాల్చాడు నందనార్. అంతే నందనార్ ఆ నటరాజులో లీనమయ్యాడు.

అపుడు 'అశరీరవాణి' ఇలా పలికింది.

నందనార్ శివభక్తి అనన్యసామాన్యం.

భగవంతుని సృష్టిలో హెచ్చుతగ్గులు లేవు.

పల్లానికి ప్రవహించే నది కూడా పూజార్హమే.

జాతిమతకులలింగభేదాలు దేహానికి గాని

ఆత్మకు లేవు. ఆలయనిర్మాణంలో అందరికీ

భాగస్వామ్యమున్నట్లే సామాజిక అభ్యున్నతిలోను

అందరు సమాన భాగస్వాములే

నందుని చరితం విస్మయావహం.

వినూత్నచరితం.

విశిష్టచరితం.



# అనుబంధం

## (i) చిదంబర క్షేత్ర- స్థలపురాణం

ఈ క్షేత్రానికి ప్రాచీన నామం తిల్లైవనం. ఈ పేరు రావడానికి ఒక ఐతిహ్యం ఉంది. ఒకా నొక కాలంలో ఇద్దరు అసుర వనితలుండేవారు. వారి పేర్లు జిల్లి, దిల్లి. వారు ఒకసారి శ్రీ ముష్ణక్షేత్రంలో భూవరాహస్వామిని సేవించడానికి వెళ్ళారు. స్వామి సంతోషించి వరాలు వేడుకొమ్మన్నారు. జిల్లి తాను ద్వారపాలక బాధ్యత స్వీకరిస్తానని ఆ వరం ప్రసాదించమని కోరింది. భూవరాహస్వామి ఆలయసీమ రక్షణాధికారం అనుగ్రహించాడు. స్వామి చెంతనే ఉండే భాగ్యం ప్రసాదించమని దిల్లి మరోసారి విన్నవించింది. భూవరాహస్వామి శ్రీముష్ణం దగ్గరిలోని పుండరీకపురం వెళ్ళవలసిందిగా ఆదేశించి అక్కడ పవిత్ర స్నానం చేసి తపం ఆచరించ వలసిందిగా 'దిల్లిని' ఆదేశించాడు. దిల్లి ఆలాగే చేసింది. స్వామి గరుడారూఢుడై ప్రత్యక్షమయ్యాడు. అపుడు దిల్లి పరవశించి తానొక వృక్షంగా మారాలని కోరుకుంది. అంతేకాదు ఆ వృక్షనామంతో ఆ ప్రదేశమంతా పిలవబడాలని అభ్యర్థించింది. ఆ వృక్షం కొమ్మలతో, రెమ్మలతో సుగంధభరితంగా ప్రకాశించాలని ప్రార్థించింది. భక్తవత్సలుడయిన భూవరాహస్వామి సరేనన్నాడు.

దిల్లి కోరిక నెరవేరింది. దిల్లి సుగంధ వృక్ష మయింది. దిల్లి శబ్దం జనవ్యవహారంలో తిల్లై అయింది. తిల్లైవృక్షాల వనం తిల్లైవనమయింది. ఆ కారణం వల్లనే ఈ ప్రదేశంలోని గోవిందరాజస్వామిని తిల్లై గోవిందరాజ అంటారు. ఆలాగే పరమశివుడు 'తిల్లై నటరాజు' అయ్యాడు. కాళి 'తిల్లైమహాకాళి'గా ప్రసిద్ధికెక్కింది. కాళీనటరాజుల విచిత్ర నృత్యప్రదర్శన జరిగిన స్థలం గనుక ఈ ప్రదేశం 'తిల్లై తిరుచ్చిత్రకూటం' అయింది పుండరీకపురం.

చిదంబర క్షేత్రానికి మరోపేరు పుండరీకపురం. పుండరీకుడు ఒక ఋషి. అతడు నారదమహర్షి శిష్యుడు. అతడు విష్ణుభక్తుడు. దివ్యదేశ సంచారం

పుండరీకుని వ్రతం. ఆ సంచారంలో ఎక్కడ సరస్సు కనబడినా, సరస్సులో పద్మాలు కనబడినా ఆ సరోవరంలోని పద్మాలను లక్ష్మీనారాయణులకు సమర్పించేవాడు. పుండరీకం అంటే పద్మం. పుండరీక సమర్పణ 'సేవా కైంకర్యం' కారణంగా అతనికి 'పుండరీక' నామం స్థిరమయింది. ఒకసారి అతడు సంచారంలో శ్రీముష్ణం చేరుకొన్నాడు. అతడు భూవరాహుని సేవించి తిల్లై తిరుచ్చిత్రకూటం చేరుకున్నాడు. ఆ తిరుచ్చిత్రకూటంలో తిరుప్పార్కడల్ తీర్థముంది. ఆ ప్రదేశం చేరుకోగానే ఆ ఋషికి ఒక అశరీరవాణి వినిపించింది. "108 పుష్పాలతో నారాయణుని పూజించమని" పుండరీకుడు సంతోషించాడు. కాని ఆ సంతోషం ఎక్కువకాలం నిలవలేదు. ఎక్కడా 'నారాయణమూర్తి' విగ్రహం కనబడలేదు. తాను భక్తి శ్రద్ధలతో సేకరించిన 108 పద్మాలు వాడిపోతాయేమో అనే బెంగ ఆ మహర్షిని క్రుంగదీసింది. ఈ లోగా నారాయణుడు చతుర్భుజాలతో శయనభంగిమలో ప్రత్యక్షమయ్యాడు. తాను సరస్సునుండి సేకరించిన 108 పుష్పాలు స్వామి 'తిరుమేను'పై కనబడడం మహర్షిని ఆనందపరవశుణ్ణి చేసింది. భక్తితో ఆ మహర్షి సాగిలి మ్రొక్కి నిరంతరం అదే ప్రదేశంలో ఇదే రూపంలో సామాన్యభక్తులకు దర్శనం ప్రసాదించవలసిందిగా చేతులు జోడించాడు. సవినయ విన్నపం ప్రకటించుకొన్నాడు. స్వామి 'సరే'నన్నాడు. అంతేకాదు. ఆ ప్రదేశానికి పుండరీక పురమని, పద్మాలకు ఆకరమయిన సరస్సుకు 'పుండరీక పుష్కరిణి' అనే పేరు స్థిరపడుతుందన్నాడు. ఆ కారణం వల్లనే చిదంబరానికి పుండరీకపురమనే నామాంతరం వ్యవహారంలో ఉంది.

**పెరుంపుత్రపులియూర్:-**

సంస్కృత బాణిలో 'పెరుం పుత్ర పులియూర్' అంటే వ్యాఘ్రపాద ఋషి. ఆ ఋషి పాదాలు సామాన్య మానవుల పాదాలవలె గాకుండా పులిపాదాల లాగా ఉండేవట. 'వ్యాఘ్రం' అంటే పులి. ఆ ఋషి శివుని కోసం, శివ దర్శనం



కోసం, శివానుగ్రహం కోసం ఈ స్థలంలోనే ఏండ్లూ, పూండ్లూ తపస్సు చేయడం వల్ల ఈ ప్రాంతానికి 'పెరుంపుత్రపులియూర్' అని రూఢి.

**(ii) చిదంబరం 'వైష్ణవ' దివ్యదేశం**

శ్రీ వైష్ణవులకు 'నాలాయిరం' పరమ పవిత్రగ్రంథం. అది 'ద్వాదశసూరుల పాశురాల' సంకలనం. పన్నిద్దరాళ్వార్లు మంగళాశాసనం చేసిన ప్రదేశాలను దివ్యదేశాలనడం సంప్రదాయం. ఆ దివ్యదేశాలలో తిరుచ్చిత్రకూటమొకటి. ఇక్కడి స్వామి గోవిందరాజు.

శయన భంగిమలో కనిపించేమూర్తి. ఈ స్వామికి దేవాధిదేవన్, పార్థసారథి అని పేర్లు. ఉత్సవరులు వీరే. ఇదేగాక 'చిత్తిరకూడత్తుళ్ళాన్' అనే మరొక ఉత్సవవర్లు ఉభయనాంచారులతో ఉన్నారు. తాయారు పేరు పుండరీక వల్లి. తీర్థం పుండరీక పుష్కరిణి. విమానం సాత్త్వికవిమానం. తిల్లైలోని 3000 మంది బ్రాహ్మణులకు, కణ్వ, పతంజలులకు సాక్షాత్కరించిన మూర్తి. ఈ స్వామిని కులశేఖరాళ్వార్ 2 పాశురాలతో, తిరుమంగై ఆళ్వార్ 32 పాశురాలతో మంగళాశాసనం చేయడం విశేషం.

ఇక్కడ 'గోపాలయ' అనే మునికి 18 రోజులు కృష్ణుడు 18 లీలలను ప్రదర్శించినాడట. అంబరీషుని ఏకాదశివ్రతం సాగిన చోటిదే.

ప్రతినదికీ 12 ఏండ్లకు పుష్కరాలు వస్తాయనడం ఆచారం. అంటే ఆ నదీ జలాలకు పుష్కరుడు ఆధిపత్యం వహిస్తాడని అంటారు. అలాగే కావేరీ నదికి కూడా 12 ఏండ్లకు పుష్కరం వస్తుంది. దానిని 'మహామాఘం' అని అంటారు. కుంభకోణంలో ఈ పుష్కరాలు వైభవంగా జరుగుతాయి. అటువంటి కావేరీనది ఈ చిదంబరంలో పుష్కరిణిలో ఒక రోజంతా ఉంటుందని ఐతిహ్యం. ఈ పుండరీకపుష్కరిణిలో అంతస్స్రవంతి.

ఈ గోవిందరాజస్వామి ఆలయానికి మరొక ప్రత్యేకత ఉంది. నటరాజు తన్ను సేవించే 3000 బ్రాహ్మణులతో 'తీర్థవారి' రోజు గోవిందరాజును దర్శించడానికి విచ్చేశాడట. సర్వశ్రేష్ఠుడైన గోవిందరాజు సంతోషపడడానికోసం చిదంబరేశ్వరుడు నాట్యమాడాడని వైష్ణవులు తరచూ చెప్పుకొని సంతోషిస్తూంటారు.

## నందనార్ జీవితసందేశం

నందనార్ దళితకులంలో జన్మించినా పరమపూజ్యుడు. దళితులు బాహ్యశుచికి, అంతశ్శుచికి ప్రాధాన్యమివ్వాలని తపించినవాడు. సనాతన ఆచారాలన్నీ మంచివని గుడ్డిగా సమర్థించని ఆదర్శమూర్తి. అందుకే గ్రామదేవతల కిచ్చే బలివిధానాన్ని తిరస్కరించాడు. తన బృందంలోని వారు శుచులై, భక్తి పరులై, ఉన్నత చింతనాశీలురు కావాలని పరితపించి వారిని నడిపించాడు.

ముక్తి సాధనకు భక్తిని పరమసాధకంగా భావించిన మహాత్ముడు. ప్రత్యేకించి శైవక్షేత్ర దర్శనానికి, ఆత్మోన్నతికి ప్రయత్నించిన భక్తుడు. నిర్మలచిత్తంతో స్వామిని సేవించి దృఢసంకల్పంతో సామాజికోపయోగి కైంకర్యాలను సహచరుల తోడ్పాటులతో సాగించిన సజ్జనుడు.

నందనార్ సంకల్పం బలీయం. చిదంబరేశ్వరుని చిత్తాన్ని దోచుకొన్న శివపరాధీన చిత్తుడు నందనార్. అతడు చైతన్యమూర్తి. అతనిది పవిత్రజీవనం. నాయన్మార్లలో నాయకమణి నందనార్.

## (iv) మరికొన్ని ఆలయ నిర్మాణవిశేషాలు

చిదంబర ఆలయం మానవాకృతికి ప్రతీకగా నిర్మితం. కనుకనే అన్నమయ్య కూడా 'తనువే గుడి అట, తలయే శిఖరమట' అని కీర్తించాడు. "దేహో దేవాలయః ప్రోక్తః" అని నమ్మినవారు హైందవులు. ఈ దృష్టితో చిదంబర ఆలయం తీర్చి దిద్దబడింది. నలువైపులా ఉన్నత గోపురాలతో నలభై ఎకరాల విస్తీర్ణంలో వేద, సహస్ర, ఆగమ, తత్త్వ, రహస్య ద్యోతకంగా ఈ ఆలయం నిర్మితం. ఈ ఆలయంలో ఐదు ప్రాకారాలున్నాయి. ఇక్కడ ప్రతి నిర్మాణం ఆధ్యాత్మికతను స్పష్టం చేస్తుంది. గోపురంలోని తొమ్మిది కలశాలు 9 శక్తులకు ప్రతీక. 'కైమరం' అనబడే వాలుల్లోని 64 భాగాలు 64 కళలను స్ఫురింపచేసేలా ఉన్నాయి. గోపురానికున్న 21,600 పెంకులు శ్వాసలకు సంకేతం. పెంకులు ఊడిపోకుండా అమర్చిన 72,000 చీలలు మానవదేహంలోని నాడుల్ని సూచిస్తుంది. 5 స్తంభాలు 5 ఇంద్రియాలకు సూచకం. అలాగే బ్రహ్మపీఠంలోని 10 స్తంభాలు ఆరు శాస్త్రాలను-4 వేదాలనూ, అలాగే కనక సభలోని 18 స్తంభాలు 18 పురాణాలను, చుట్టూ ఉన్న 96 కిటికీలు, 96 తత్త్వాలకూ సూచిక అని పెద్దలు చెబుతారు.

ఈ ఆలయంలో షట్కాలపూజావిధానం ఉంది.

## (v) నటరాజ విగ్రహమూర్తి వైశిష్ట్యం

విదేశీయులను ఎంతో ఆకర్షించిన విగ్రహాలలో నటరాజ విగ్రహం ఒకటి. అది నృత్య భంగిమ విగ్రహం. జగత్ చైతన్యానికి, బ్రహ్మాండశక్తికి సంకేతం. నృత్య పరవశుడైన స్వామి పాదాల క్రింద అపస్మారక పురుషుడు అణగ తొక్కబడుతుంటాడు. ఆ పురుషుడే అజ్ఞానమూర్తి.

స్వామి చేతిలోని డమరుకం సృజనశక్తికీ, ఆదిశబ్దానికీ సంకేతం. రెండవ చేతిలోని అగ్నిశిఖ మాయామోహాదుల దహనాన్ని, ఇంకొక చేయి అభయముద్రను, మరొకటి పాదాన్ని సూచించడం విశేషం. నాలుగు చేతుల విన్యాసం చిత్రం. అయితే కొన్ని విగ్రహాలలో ఒక చేతిలో లేడి ఉండటం కనిపిస్తుంది. అది మనసుకు సంకేతం. చంచలమైన జింకను పట్టడం ఎంత

కష్టమో మనసును అదుపులో ఉంచడం అలాంటిదని 'లేడి' సూచిస్తుంది. విగ్రహం వెనుక వర్తులాకారంలో దీపాల వరుస విస్తరించిన ప్రవృత్తికి, విజ్ఞానానికి సంకేతం. విరబోసిన కేశాలు ఆగని చైతన్యానికి సంకేతం. పుర్రె పరమశివుని లయశక్తికి, జటాజూటంలోని గంగ పావనత్వ ప్రసాదానికి సస్యశ్యామలత్వానికీ, పై నెలవంక సౌందర్యానికీ-కాలానికీ, తలమీది పాము కుండలినీశక్తికి, మూడవకన్ను జ్ఞాననేత్రానికీ సంకేతాలు. అలాగే కుడిచెవికి మకరకుండలం, ఎడమచెవికి తాటంకం అర్ధనారీశ్వర తత్త్వసూచకం. మెడలోని పుర్రెల పేరు అనంతకోటి సృష్టులకు, వాని విధ్వంసానికి సూచకం. శరీరానికి పూసుకున్న భస్మం పవిత్రత, వైరాగ్యాలకు చిహ్నాలు. మెడలోని స్ఫటికమాల ఘనీభవించిన కరుణాబిందువులు. 96 సూత్రాల యజ్ఞోపవీతం తత్త్వాలకు ప్రతీక. ధరించిన వ్యాఘ్రచర్మం అహంకారాన్ని ఒలిచిన స్థితికి ద్యోతకం. ప్రదోషకాలంలోని నృత్యం- మాయానిర్మూలనం, కర్మదహనం, జీవోద్ధరణను తెలియజేస్తుంది. జ్వలించిపోయే వేదిక ఒక శివునిదే. ఇది ఆర్తిగల భక్తుని హృదయానికి సంకేతం. కొందరి దృష్టిలో నటరాజ రూపం పంచాక్షరికి సంకేతం. పాదం- న; నాభి- మ; భుజాలు- శి; ముఖం- వ; శిరస్సు- య.

ఒక పాము మరి ఒకపులి పరమశివుని ఆరాధించి అనుదినం నటరాజతాండవాన్ని దర్శిస్తూ ఉంటాయని స్థలపురాణం చెబుతుంది. అందుకే సంస్కృతంలో భుజంగాష్టకం, కవచ స్తోత్రాదులు వెలువడ్డాయి. ఇవేగాక తిల్లైవన మాహాత్మ్యం, చిదంబర మాహాత్మ్యం, సభానాథ మాహాత్మ్యం, చిదంబర రహస్యాది గ్రంథాలు తమిళంలో ఈ మూర్తిని వర్ణించాయి.

**చిదంబరం - నాయన్మార్లు**

శైవులకు చిదంబరం ముక్తిస్థలం. శైవులు తిరువారూర్‌లో పుట్టుకను, తిరువన్నామలైలో కౌమారాన్ని, కాంచీపురంలో జీవనానుభవాన్ని, కాశీ లేదా చిదంబరంలో మరణాన్ని కోరుకుంటారు.



నాయన్మార్లలో మాణిక్యవాచకర్‌కు సాయుజ్యం ఈ చిదంబరేశ్వరుడే ప్రసాదించాడు. అతనికి స్వస్వరూపంతో సాక్షాత్కరించాడు. చిదంబరంలో మాణిక్యవాచకర్ తాను వ్రాసిన తాళపత్ర గ్రంథాన్ని సంతకం చేసి స్వామికి అర్పించాడట. ఆ మరుసటి రోజే ఆ గ్రంథం ఒక భక్తుని ద్వారా దశదిశలా వ్యాపించింది. వైష్ణవులకు నాలాయిరంలాగా శైవులకు 'తేవారం' ముఖ్యమైంది. ఇది వేదతుల్యం. ఈ క్షేత్రంలో తేవారం నిక్షిప్తంగా ఉండగా 'నంబియాండార్ నంబి' మూలంగా వెలుగులోనికి వచ్చి ప్రచారానికి నోచుకుంది. అలాగే తిరునీలకంఠ నాయనార్ యువకుడుగా మారడం కూడా ఈ క్షేత్రంలోనే. ఉమాపతి శివాచ్చియార్ అనే ప్రసిద్ధశైవ వేదాంత పండితుడు స్వామిని సేవించి తరించినది ఇక్కడే. అతని సమాధి ఇప్పటికీ చిదంబరం రైల్వే స్టేషన్ సమీపంలో భక్తుల్ని ఆహ్వానిస్తూ ఉంటుంది. అలాగే శేక్కిళార్ తన పెరియపురాణాన్ని అనభయ చోళుని ఆదేశం మేరకు ఇక్కడే స్వామి ముంగిట గానం చేశాడట. దళితుడైన 'నందనార్' శివైక్యం కావడం ఈ క్షేత్ర ఔన్నత్యానికి ప్రత్యేకత.

### (vi) తమిళ, శైవ సంప్రదాయాలలో నందనార్ వృత్తాంతం:-

తమిళ శైవ సంప్రదాయాలలో 12 భక్తి స్తోత్రాలు, 14 ఆదేశ స్తోత్రాలు ప్రసిద్ధాలు. వీటిలోని పండ్రెండు భక్తి స్తోత్రాలను 'పన్నిరు తిరుమురై' అంటారు. ఈ 12 వ తిరుమురైను పెరియపురాణం అనడం సంప్రదాయం. పెరియపురాణమంటే పెద్దపురాణమని అర్థం. ఈ పురాణ రచయిత శేక్కిళార్.

బాల్యంలో శేక్కిళార్ పేరు అరుళ్‌దేవర్. మదరాసుకు దగ్గరలోని 'కున్రత్తూర్' ఇతని జన్మస్థలం. ఇతడు అభయకులశేఖర చోళరాజు మంత్రి. శేక్కిళార్ తన గ్రంథాన్ని 'తిరుత్తొండర్ పురాణం' అన్నాడు. తొండు అంటే సేవ. తొండర్ అంటే భక్తులు. భక్తుల కథలు లేదా పుణ్యసేవకుల కథలు అనవచ్చు.

సాధారణంగా పురాణం అనగానే చాల పెద్దది అనే భావం ఉండవచ్చు. కాని శేక్కిళార్ ప్రతిభక్తుని కథను సంగ్రహంగా రచించి ప్రతి ఒక్కరి చరితను 'పురాణం' అన్నాడు. భక్తుల చరిత్రలో చిన్న అధ్యాయాలే. అయినా పురాణం అనడం చిత్రం. ఇందులో అరవైముగ్గురి భక్తుల చరిత్రలున్నాయి. సామూహికంగా మరి తొమ్మిది మంది భక్తులు. మొత్తం 72 చరితలు. ఈ భక్తుల చరిత్రలు అనేకరకాలు.

కొన్ని సంకలిత కథలు, అపరాధవిముక్త భక్తుల కథలు, భక్తానుభక్తులు, నిరంతర పరమేశ్వరానురక్తులు. నిత్యం పరమాత్మ సన్నిధిలోని వారు. మానవ కల్పితములయిన కులమతజాతి కాలాది వర్గాలకు అతీతమయినవారు. మూలాధారం పొందినవారు. వీరిలో మానవ కల్పితములయిన కులమతజాతి కాలాది వర్గాలకు అతీతులయిన భక్తులలో 'నందనార్' ఒకడు. శేక్కిళార్ రచనలో నందనార్ 18వ వాడు. పెరియ పురాణమంతా 13 అధ్యాయాలు. తిరువిరుత్తమనే ఛందస్సులో వ్రాయబడ్డవి. ఇందులో 4,236 పద్యాలున్నాయి.

నందనార్ చరిత్రను అఖండ భావనాకల్పనలతో మానవీయత అతిశయించే తాత్త్విక, నాటక, సంగీత రూపకంగా తీర్చిదిద్దినవారు శ్రీ గోపాలకృష్ణభారతిగారు. అతని కాలం 19వశతాబ్దం. భారతి బ్రాహ్మణుడైనా నందనార్ కథ విని ప్రభావితుడయ్యాడు 'నందనార్ చరిత్తిర కీర్తనై' అనే గ్రంథంలో 134 కీర్తనలు, 21 ఛందోరీతులు, మొత్తం 298 పాటలున్నాయి. ఈ పాటలు కొన్ని బహుళ ప్రచారానికి నోచుకున్నవి. 'అయ్య ఒరు సెయ్‌ది కేళుం (అయ్యా! ఒక మాట వినండి), మార్గళిమాదం తిరువాదిరైనాళ్ (ధనుర్మాసంలో ఆర్ద్రా నక్షత్రదినం), శివలోగనాదనైక్కండు (శివలోకనాథుని కనులారాగాంచి), శిదంబరం పోనామల్ ఇరుప్పేనో (చిదంబరానికి వెళ్ళకుండా ఉండగలనా?) లాంటి పాటలు పండిత పామరుల్ని ఆకర్షించాయి. అంతేకాదు పొలాలలో రైతు కూలీలు పట్టణాలలో



బిచ్చగాళ్ళు ఈ కీర్తనల్ని ఇప్పటికీ పాడుకోవడం ఆ పాటల మాధుర్యాన్ని స్పష్టం చేస్తున్నాయి. మరొక్కవిశేషం. తమిళం మాట్లాడే ఇతర దేశాలలో కూడా ఈ పాటలకు విశేషప్రచారం దక్కడం భారతీయ ఖ్యాతిని ఇనుమడింపచేస్తుంది.

తెలుగువారు కూడా ఈ కథను ఆదరించినవారే. హరికథకులు ప్రధానంగా ఈ కథను అభిమానించి రసవత్తరంగా ప్రదర్శనలిస్తుంటారు. తెలుగు సినిమాలో కూడా 'నందనార్'కు సంబంధించి పాటలు వచ్చాయి.

## (vii) సంకీర్తనలలో 'చిదంబరం'

దీక్షితర్ (క్రీ.శ 1776) కృతి 'ఆనందనటన ప్రకాశం–కేదారరాగం, మిశ్రఏకతాళం

ఆనందనటనప్రకాశం చిత్సభేశం
ఆశ్రయామి శివకామ వల్లీశం

భాను కోటి కోటి సంకాశం
భక్తి ముక్తి ప్రద దహరాకాశం
దీనజన సంరక్షణచణం దివ్య పతంజలి
వ్యాఘ్రపాదదర్శిత కుంచితాబ్జచరణం ॥ఆనంద॥

శీతాంశుగంగాధరం నీలకంధరం
శ్రీకేదారాది క్షేత్రాధారం
భూతేశం శార్దూలచర్మాంబరం చిదంబరం ॥ఆనంద॥

భూసుర త్రిసహస్ర మునీశ్వరం విశ్వేశ్వరం
నవనీతహృదయం సదయగురుగుహ తాతమాద్యం, వేదవేద్యం
వీతరాగిణ మప్రమేయాద్వైత ప్రతిపాద్యం
సంగీత వాద్య వినోద తాండవ జాత బహుతర భేదచోద్యం ॥ఆనంద॥

1) **దొరసామయ్య (1782-1816)**

పంతువరాళి - మిశ్రచాపు

**ప.** అద్భుత నటనం బాడీని మా అంబరకేశుడు

**అను.** అద్భుత మద్భుతమని ధర్మవర్ధని
అడుగడుగుకు జూచి మెచ్చ మోదము హెచ్చ
హరహర శివశివ యనుచు
సురలందరును వందనము సేయ

**చర.** ధాత వెంట నిల్చి చేత తాళము బూని
తా తై తై యనగా పల్కుల నాతి యను
జీమూతంబా సంగీతము వర్షింపగ
పురుహూతుడపుడు వేణుగీతము సేయ
సభాతలమునకు కృపాతటినీశుడు
తా తకిట ఝుణుత కిటకిట తకతరి
కిటతక ఝొంతరి కిటతక ఝుమని

అంగజు తండ్రి మృదంగము పూని
ధళాంగని వినిపించగ ఆ
ఇంగితంబు గని మంగళదేవి కరంగి
లయము వేయగా కు
రంగనేత్రయౌ ధరాంగన నాదము
భంగము లేక చెలంగింప నపుడు
తత్తోంగ్ తకతోంగ్ తకణం తరితోంతం
తరికిట తకతోం తరికిటకతోమని



కరములెత్త మైమరచి ఋషులెల్ల
హర హర హర యనగా నందికే
శ్వరు డందరికి ముందరను నిల్చి
హెచ్చరిక పరాకనగా, లంబో
దర సుబ్రహ్మణ్యు లిరుగడలను
శంకరభవ మా ముద్ధరయని మొరలిడ
ధరితకిట ఝొణుతకిట దృగ్గుతక తద్ధితళాంగు
దృగ్గుతళాంగు తక తధిం గిణ తోమ్మని-అద్భుత

2) **గౌళిపంతు** - ఆదితాళం

ధూర్జటి నటించెను ప్రదోష సమయమునను
ఊర్జితముగ రజతాద్రికొన నత్యున్నతమౌ వజ్రమంటపమున
సురలసురులు కిన్నరు లిరుగడ యాడె నం
దీశ్వర వరకర మురజరవముతో గూడ
ఉరగము లసియాడ జడనుండు ఉవిద జడిసి వేడ
మెరయుచు నరచందురు చిరువెన్నెల గాయ
ప్రణవనాదము మ్రోయ ॥ధూర్జటి॥

మురహరుడతి దురమున డమరువు పలికింప
సరసిరుహభవు పెదవు లదరగ కనిపింప
వరుసక్రమముగాను బాగుగ నవరసకళలతోను
దరహసిత ముఖాంబురుహమున ముద్దుగార చిరుచెమటలార
వరనూపుర మణులు చరణముల ఘలు ఘల్లన
అరకాలనమరు నసురునికి గుండె ఝల్లన
మరువైరి వగను సుబ్రహ్మణ్యుని బాగుగను
కరమును కనికరమును జూచి కరుణింప-మేను పులకింప ॥ధూర్జటి॥

3) **తోడిరాగం** – రూపకతాళం

తత్తధిమి తధిదిద్ధయని సదాశివు డాడీనె

4) **ఫరజురాగం** – ఆది

ఆడీనమ్మా హరుడు ద్రుకట థైయని
జాడగ గిరికన్యకను క్రీగంట
జూడ నంది సెబాసని కొనియాడ
చూడ జూడ వేడుకగా చంద్ర
చూడుండు మూడుకండ్లవాడు

* * *

సంధ్యాఘర్మదినాత్యయో హరికరాఘాత ప్రభూతానన
ధ్వానో నారిద గర్జితం దివిషదాం దృష్టచ్ఛము చంచలా
భక్తానాం పరితోష బాష్పవితతిర్వృష్టిర్మయూరీ శివా
యస్మిన్నుజ్జ్వలతాండవం విజయతే తం నీలకంఠం భజే

**– శంకరాచార్య**

(viii) **ఉపయుక్త గ్రంథసూచి**


**ఆంగ్లం**

Ancient Temples of Tamilnadu
- M. Parama sivanadhan

**తమిళం**

కోయిల్ పురాణం – ఉమాపతి శివాచ్చారియార్
నందనార్ చరిత్తరకీర్తనై – గోపాలకృష్ణభారతి





**తెలుగు**

చంద్రభాగాతరంగాలు – స్వామి సుందరచైతన్యానంద
పెరియపురాణము – మద్దాలి సుబ్బారావు
మన దేవతలు – జానమద్ది హనుమచ్ఛాస్త్రి
యాత్రామార్గదర్శిని – రాగం వెంకటేశ్వర్లు
సంపూర్ణభక్తవిజయము – జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి